ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 సంచిక : 05 జనవరి 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాలకొల్లు ....... 11-11-2007
జువ్వలపాలెం .. 15-11-2007
తణుకు ........... 18-11-2007
గొరగనమూడి . 09-12-2007

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-11-2007, పాలకొల్లు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జీవితం అంతా తలంపులే. మీకు ఎప్పుడైనా సంతోషం వస్తుంది అది కూడా తలంపే, మీకు ఎప్పుడైనా దుఃఖం వస్తుంది అది కూడా తలంపే, శరీరం చనిపోవటం కూడా నిజంకాదు, అది కూడా తలంపే. ప్రతీ మనిషి జీవితం పొడుగునా ఏదోపని చేస్తూఉంటాడు, వాడు చివరిసారి చేసేపని మరణం. మనం ముఖ్యంగా గుర్తించవలసింది ఏమిటి అంటే మనకు ఆరోగ్యం బాగాఉన్నా, ఆరోగ్యం బాగాలేకపోయినా ఈ శరీరం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని పూర్తిఅయిన వెంటనే శరీరం మరణిస్తుంది. ఒక క్షణం ముందు చనిపోదు, ఒక క్షణం తరువాత చనిపోదు. ఇదంతా ఈశ్వరనిర్ణయం ప్రకారం జరుగుతుంది. ప్రాణం తీయటం కూడా మన యిష్టం కాదు, ఎవడైతే శరీరంలో ప్రాణం పోసాడో వాడే ప్రాణం తీస్తాడు. మనకు ఎవరికి చనిపోవటం అంటే యిష్టం ఉండదు. వందసంవత్సరాలు జీవించినా, జబ్బుతో బాధపడుతున్నాకూడా ఇంకా జీవించాలి అనుకొంటాము. ఎందుచేతనంటే ఈ శరీరం చనిపోతుంది కాని చావుపుట్టుకలతో సంబంధంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది, అది మనమై ఉన్నాము అందుచేత మనకు మరణం అంటే ఇష్టం ఉండదు.

భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి. మీరు చేసే పనులకు, మీకు వచ్చే ఆలోచనలకు అన్నింటికి సాక్షిగా ఉన్నాడు. భగవంతుడు కూడా శరీరం ధరించి వస్తాడు. ఇప్పుడు మనం చొక్కా తొడుక్కున్నాము. ఈ చొక్కాకు నాకు సంబంధం లేదు

అని మనకు తెలుస్తుంది. అలాగే భగవంతుడు శరీరం ధరించినప్పుడు అది వాడికి చొక్కాలాగ ఉంటుంది. ఆ శరీరానికి ఆయనకు సంబంధం లేదని ఆయనకు తెలుస్తూ ఉంటుంది, వచ్చినపని చూసుకొని వెళ్ళిపోతాడు. కాని మనం ఆశరీరంతో బంధింపబడతాము. నీ దేహం దేవాలయం, నీలోపల అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. ఈ శరీరానికి చావురాకముందే భక్తియోగం, కర్మయోగం, ధ్యానయోగం ఇలా ఏదో ఒక యోగాన్ని ఆశ్రయించి, సాధన చేసి హృదయంలో ఉన్న భగవంతుడిని ఎవడైతే తెలుసుకొన్నాడో వాడే జీవన్ముక్తుడు. వాడికి శరీరం ఉన్నా ఒక్కటే, శరీరం పోయినా ఒక్కటే, వాడు ముగింపులేని ఆనందాన్ని, శాంతిని అనుభవిస్తూ ఉంటాడు. ప్రతీవాడికి ఉండాలని ఉంది, ఎవడికీ చనిపోవాలని లేదు. ఆ ఉండే వస్తువు ఏదో ఒకటి ఉంది, అది ఎప్పుడూ ఉంది, అది అన్నిఅవస్థలలో అన్నికాలాలలో ఉంది. ఆ ఉండటం అనేదానిని ఎవడైతే అనుభవైకవేద్యం చేసుకొన్నాడో వాడే జీవన్ముక్తుడు, అదే మన జీవితగమ్యం. ఏదో యోగాన్ని అవలంభించి లేకపోతే అన్ని యోగాలను సమన్వయం చేసుకొని ఆ స్థితిని పొందటానికి ప్రయత్నం చేయండి. కృష్ణుడు దేవుడు, అర్జునుడు జీవుడు, దేవుడు జీవుడికి చేసిన బోధే భగవద్గీత. అన్నిరకాల సాధకులను దృష్టిలో పెట్టుకొని భగవంతుడు సాధనా విధానాలు చెప్పాడు. నేనే గమ్యం, నన్ను పొందటానికి నేనే మార్గం, నన్ను ఆలంబనగా తీసుకోండి అని పరమాత్మ చెప్పాడు. మరణించేటైములో ఆ చివరి శ్వాసలో భగవంతుడి స్మరణ ఉంటేచాలు కాని మనకు అప్పడు భగవంతుడి స్మరణ ఉండదు. అంటే భగవంతుడిని మరిచిపోవాలని మర్చిపోము. భగవంతుడి మీద మనకు యిష్టం ఉంటుంది కాని అంతకంటే ఎక్కువైన ఇష్టాలు మనకు ఉంటాయి, అవే మనకు చివరిటైములో జ్ఞాపకం వస్తాయి.

దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఇవి మూడూ మనలను పీడించేస్తాయి. వీటిలోనుండి విడుదల పొందాలంటే సాధన ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి, అవతారపురుషుడి అనుగ్రహం ఉండాలి. ఈ మూడు వాసనల నుండి విడుదలపొందితేగాని నిర్వాణసుఖం పొందలేము. మనిషి ఏపని చేసినా ఆనందం కోసమే చేస్తాడు కాని వాడికి ఆనందం రాదు. ఆపని సాధిస్తాడు, ఆపని సాధించాక ఇందులో కూడా ఆనందం లేదని వాడికి తెలుస్తుంది. ఆనందం ఎక్కడ ఉంది? మన స్వరూపమే ఆనందం. మన స్వరూపం ఆనందం అన్నసంగతి మరిచిపోయి ఆనందం కోసం లోకంలో వెతుకుచున్నాము. వస్తువును ఒక చోట పోగొట్టుకొని ఆ వస్తువుకోసం వేరొకచోట వెతుకుచున్నాము, అది ఎలా దొరుకుతుంది. మన పరిస్థితి ఇలా ఉంది. భగవంతుడికి రూపం లేదు, నామం లేదు. రూపంలేని భగవంతుడిని,

నామం లేనిభగవంతుడిని పట్టుకోవటం కష్టం. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీరు నదిని దాటాలి అనుకోండి, మీరు ఈదుకొని వెళ్లవచ్చు లేకపోతే ఒక నావమీద వెళ్లవచ్చు. నిరాకారాన్ని, నిర్గుణాన్ని పట్టుకొని మీరు తరించాలంటే అది ఈదుకొని నదిని దాటటం వంటిది. ఏదో ఒక అవతారపురుషుని, గురువుని సపోర్టుగా తీసుకొని మీరు తరించటం ఎటువంటింది అంటే నావమీద నదిని దాటటం వంటిది. ఈ రెండింటిలో సాకారం కొద్దిగా తేలికగా ఉంటుంది, నిరాకారాన్ని ఆరాధించి మీరు గమ్యాన్ని చేరుకోవటం చాలా కష్టంతో కూడినపని. కలియుగంలో కామక్రోధాలు ఎక్కువగా ఉంటాయి అని భగవంతుడు చెప్పాడు. ఎవరి మొఖాలు చూసినా అందరికీ కోపాలే, బాగా చదువుకోమంటే కోపం, అల్లరి చెయ్యవద్దు అంటే కోపం, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోండి అంటే కోపం అన్నింటికీ కోపాలే. యుగ ప్రభావం అటువంటిది అని చెప్పాడు. ఈ కలియుగంలో నామాన్ని శ్రద్ధగా స్మరించుకోండి చాలు అని చెప్పాడు.

జ్ఞానదేవుడు ఏమని చెప్పాడు అంటే నాకు కాళ్లు ఉన్నాయి, చేతులు ఉన్నాయి ఎవరి సహాయం లేకుండా నా కాళ్లకు చేతులకు పని చెప్పి నేను సముద్రాన్ని దాటి వెళ్లిపోతాను అని చెప్పేవాడు ఎటువంటివాడో గురువు సహాయం లేకుండా, దేవునిదయ లేకుండా మేము మోక్షాన్ని పొందుతాము అని చెప్పేవారు కూడా అటువంటివారే అన్నాడు. ఇవన్నీ అనుభవం లేకుండా చెప్పే మాటలు. ఈ కలియుగంలో అందరూ కంగారు కంగారుగా ఉంటారు. ముందు తిట్టేయటం తరువాత సారీ చెప్పటం ఇలా ఉంటుంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే మీరు జ్ఞానయోగం అవలంభించాలంటే మనస్సు సమానంగా ఉండాలి, బుద్ధిసూక్ష్మత ఉండాలి. బండవారికి జ్ఞానయోగం పనికిరాదు అని చెప్పారు. మనం దేహంతోటి, ఇంద్రియాల తోటి, మనస్సుతోటి తాదాత్మ్యం పొందుతూ ఉంటాము. మనం ఏదైతే కాదో వాటితో తాదాత్మ్యం పొందుతూ ఉంటాము. జ్ఞానయోగం ద్వారా ఈ తప్పడు తాదాత్మ్యంలో నుండి విడుదలపొందటం ఈ కలియుగంలో కష్టం, కర్మయోగం గురించి ఏమని చెప్పారు అంటే మీరు సత్కర్మ చేస్తే సరిపోదు, ఆ సత్కర్మ కూడా స్వార్థం లేకుండా చేయాలి. మేము అది సాధించాము, ఇది సాధించాము అని చాలామంది చెపుతూ ఉంటారు. వారు ఏమీ సాధించలేదు, అక్కడ చేసింది భగవంతుడు. అందరికీ సంపాదించాలని ఉంది కాని అందరూ కోటీశ్వరులు అవ్వలేరు అందరికి పండితులు అవ్వాలని ఉంది, కాని పండితులు అవ్వలేరు. అందరికీ అధికారంలోనికి వెళ్లాలని ఉంది కాని అందిరికి పదవులు రావు, ఇదంతా భగవంతుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. అర్జునా! ఇక్కడ గురువులు ఉన్నారు, పెద్దలు ఉన్నారు వీరందరినీ చంపటం ఎలాగ అని నువ్వు

అనుకొంటున్నావు, నువ్వెవడవు చంపటానికి, నేను అందరినీ చంపే ఉంచాను, పని నాది, గౌరవం నీది అన్నాడు పరమాత్మ. భారతదేశంలో జన్మించిన మహావీరులలో అర్జునుడు ఒకడు. అటువంటి మహావీరుడిని పట్టుకొని నీవు ఊరికే అక్కడ బొమ్మలాగ నిలబడు పని నాది, గౌరవం నీది అన్నాడు, ఇంక మన మాట ఏమిటి?

జీవితంలో అది సాధించాము, ఇది సాధించాము అంటారు. మీ ద్వారా ఆ పని జరిగే యోగం ఉన్నప్పుడు పరిస్థితులు మీకు అనుకూలం చేస్తాడు. అప్పుడు మేము సాధించాము అని మీరు అనుకొంటారు కాని అంతా ఈశ్వర సంకల్పంతోనే జరుగుతోంది. మీకు తెలుసున్నా అంతే, మీకు తెలియకపోయినా అంతే. ఇది తెలుసుకోవటానికే సాధన. మీ ఇంటి దగ్గర మీ పనులు శ్రద్ధగా చేసుకొంటున్నారు కాని భగవంతుడి పని చేయటానికి మనం ప్రిపేర్ అవ్వటం లేదు. అందుచేత మనకు జ్ఞానం రావటం లేదు. ఎవడైతే తన నామరూపాలను ప్రక్కనపెట్టి, ఇష్టాయిష్టాలను ప్రక్కనపెట్టి భగవంతుడి ప్రీత్యర్థం, భగవంతుడి అనుగ్రహం సంపాదించటానికి శరీరంతో పని చేస్తున్నాడో, బుద్ధితో ఆలోచిస్తున్నాడో వాడు భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడవుతాడు, వాడికి మోక్షం వస్తుంది. మీరు చేసే సత్కర్మ కూడా సకామంగా చెయ్యవద్దు, నిష్కామంగా చెయ్యండి. మీరు గౌరవం ఆశిస్తారు అనుకోండి అది లోకానికి సంబంధించినది. పని చెయ్యాలి మర్చిపోవాలి. మీరు చేసే పని భగవంతుడు గుర్తిస్తున్నాడు కాని లోకం గుర్తించాలని మీరు అనుకొంటారు ఎందుచేతనంటే మీ దృష్టిలో లోకం నిజం, భగవంతుడు అబద్ధం. కాని యదార్థం చెప్పాలంటే భగవంతుడు సత్యం, లోకం అసత్యం. మీరు ఫలకాంక్షతో పనులు చేస్తున్నారు అందుచేత భగవంతుడి యొక్క వైభవం మీకు తెలియటం లేదు. కోరికలేనివాడు, కోపం లేనివాడు, ఫలకాంక్ష లేనివాడు నిత్యసన్యాసి అని పరమాత్మ చెప్పాడు. మీరు ఏదో పని చేస్తారు. మీ కోరికతో సంబంధం లేకుండా ఫలితం వస్తుంది అనుకోండి, అది మిమ్మల్ని బంధించదు. మీరు కోరి తెచ్చుకొంటే మటుకు అది మిమ్మల్ని బంధిస్తుంది.

ఉన్నదేదో ఉంది, ఆ ఉండటం అనే దానిని తెలుసుకో అంతేగాని నేను దేవుడిని, నేను దేవుడిని అనుకోకు పాడైపోతావు. ఈ విషయంలో బహుజాగ్రత్తగా ఉండమని భగవాన్ చెప్పారు. నీకు దేహము తాలుక ఎరుక ఎలా ఉందో అలాగ నీలోపల ఉన్న సత్యవస్తువు తాలుక ఎరుక సంపాదించు. అంతేగాని లోపల జీవలక్షణాలు పెట్టుకొని, రాగద్వేషాలు పెట్టుకొని నేను దేవుడిని, నేను దేవుడిని అంటే వికాసం రాదు సరికదా నీవు సంపాదించుకొన్న భక్తి ఉంటే పోతుంది అని చెప్పారు. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి. మీరు సత్కర్మ

చేయగా చేయగా, అది స్వార్థం లేకుండా చేస్తూ ఉంటే మీకు చిత్తశుద్ధి కలుగుతుంది, మనస్సు విశాలమవుతుంది. ఇప్పడు మనం ఒక కాలంతోటి, ఒక వర్గంతోటి, ఒక కుటుంబంతోటి తాదాత్మ్యం పొందుతున్నాము, చిత్తశుద్ధి కలిగినప్పడు వాడు సృష్టితో తాదాత్మ్యం పొందుతాడు. ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే మీకు దుఃఖం వస్తుంది. దుఃఖం ఎందుకు వస్తోంది అంటే ఆ విమర్శను మీరు లోపలకు తీసుకుంటున్నారు. అది ఎవరు తీసుకుంటున్నారు? దేహం తీసుకోవటం లేదు. దేహంతో తాదాత్మ్యం పొందే నేను తీసుకొంటోంది. ఎవరైనా పొగిడితే పొంగిపోతారు. ఈ రెండు గుణాలు చెడ్డవే. ఈ రెండింటి వలన వ్యక్తిభావన పెరిగిపోతుంది. మీరు జ్ఞానం సంపాదించాలంటే సుఖం మీద అపేక్ష వదిలేయాలి. సుఖం వస్తే రానివ్వండి దాని మీద అపేక్ష వదిలేయండి. ఏమిటండీ మాకు ఇంకా సుఖపడేరోజు రాలేదు, ఈ చాకిరీ తప్పటంలేదు అంటారు. ఆ సుఖాన్ని ఏమి చేసుకొంటారు. బయట వ్యక్తుల నుండి, ప్రపంచంలో నుండి వచ్చే సుఖం మీద ఎంతకాలం ఆధారపడతారు. సుఖం కోసం ఎదురుచూస్తూ ఉంటే అది అజ్ఞాన లక్షణం.

మీ దేహప్రారబ్ధం ప్రకారం ఏమి జరుగవలసి ఉందో ఆ దేహం ద్వారా అది జరిగి పోతుంది, దానిని మనం ఆపుచేయలేము. కాని మనం ఏమిచేయాలంటే జీవితంలో జరిగే సంఘటనతో తాదాత్మ్యం పొందకుండా, ఆ సంఘటనల నుండి పాఠాలు నేర్చుకోవాలి. మనం ఏదో పనిచేస్తాము. ఆ పనికి ఫలితం ఎప్పడు వస్తుంది అని ఫలితం కోసం ఎదురు చూస్తున్నాము అనుకోండి, అలా ఎదురుచూసేవారికి భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం, మన మనస్సు చెప్పేదే నిజం అని వాడికి అనిపిస్తుంది అది వాడి స్వభావం. కర్మఫలం పట్ల ఆసక్తి ఉన్నవారి అందరి జీవితాలు ఇలాగే ఉంటాయి. భగవంతుడు చెప్పినమాటలు వదిలేసి కర్మఫలకాంక్ష ఎక్కువగా ఉన్నవారు చెప్పే మాటలు భుజాన వేసుకొని తిరుగుతారు ఏమిటి? భగవంతుడు మీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకోండి. భగవంతుడిని నోటితోనే కాకుండా చేతులతో కూడా ఆరాధించటం నేర్చుకోండి. కలియుగంలో హింసాప్రవృత్తి ఎక్కువగా ఉంటుంది. కలియుగంలో మీరు తరించటానికి పెద్ద పెద్ద యజ్ఞాలు, యాగాలు చేయనక్కరలేదు, నిరంతరం భగవంతుడిని ప్రేమతో స్మరించుకొంటే సరిపోతుంది. భగవంతుడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉన్నవారికి శరణాగతిమార్గం మంచిది. శాస్త్రంలో భగవంతుడు ఉన్నాడు అని చెపుతున్నారు. తీరా లేడేమో అని అనుమానం పెట్టుకొన్న వారికి విచారణామార్గం మంచిది. దీనికి ఆచార్యులవారు ఒకమాట చెప్పారు. అక్కడ పులి

ఉంది అన్నారు. మీరు తుపాకీ పట్టుకొని వెళ్లండి. అక్కడ పులి ఉంటే దానిని కాల్చేయవచ్చు. అక్కడ పులి లేదు అనుకో నీచేతిలో తుపాకీ ఉండటం వలన నీకు వచ్చే నష్టం ఏమీ లేదు. అక్కడ నిజంగా పులి ఉంది అనుకో నీ చేతిలో ఆయుధం లేదు అనుకో అది మిమ్మల్ని మింగేస్తుంది. అందుచేత దేవుడు లేడు అనటంకంటే దేవుడు ఉన్నాడనే బతకండి. నిజంగా దేవుడు లేడు అనుకో మనకు వచ్చే నష్టం లేదు. దేవుడు లేడు అని బతుకుతాము అనుకోండి, దేవుడు ఉంటే అప్పుడు మీ పరిస్థితి ఏమిటి?

ధర్మాన్ని ఆచరించు, ధర్మాన్ని ఆచరించటం వలన శాంతి కలుగుతుంది. ఈ లోకాన్ని అంతా మనం ఉద్ధరించలేము. మన పని మనం శ్రద్ధగా చేయాలి. మనం ఎవరికైనా మంచి చేసాము అనుకోండి దాని వలన వారు బాగు పడినా, బాగుపడకపోయినా మంచిపనులు చేయటం వలన మనం పవిత్రులం అవుతాము. మహాత్మగాంధీగారు ఈ దేశానికి చాలా సేవ చేసారు అని చెపుతున్నారు, ఆయన సేవ చేయటం వలన ఈ దేశం ఏమైనా బాగుపడిందా అని చలంగారిని అడిగారు. అప్పుడు చలంగారు ఒక చక్కటి మాట చెప్పారు. గాంధీగారు ఏమీ ఆశించకుండా ఈ దేశానికి సేవ చేసిన మాట నిజం. ఆయన చేసిన సేవ వలన దేశం బాగుపడిందా లేదా అనేది వేరే విషయం, దానివలన ఆయన మహాత్ముడు అయ్యాడు అని చెప్పారు. భక్తి ద్వారా భగవంతుడితో అనుసంధానం పెట్టుకోవాలి. ఏవిధమైన ఎటాచ్‌మెంట్స్ లేనివాడితో ఎటాచ్‌మెంట్ పెట్టుకొంటే మనకు ఉన్న ఎటాచ్‌మెంట్స్ పోతాయి. అంతేగాని ఒక మమకారం ఉన్నవాడు ఇంకో మమకారం ఉన్నవాడిని పట్టుకొంటే ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడిని పట్టుకొన్నట్లుగా ఉంటుంది, ఇద్దరు పతనమవుతారు. మనందరము నేను నేను అంటాము కదా. ఆ నేనును ఎవరైనా పొగిడితే సంతోషం వస్తుంది, ఆ నేనును ఎవరైనా భంగపరిస్తే వారి మీద మనకు కోపం వస్తుంది. మనకు తెలిసినా, తెలియకపోయినా ప్రతీవాడు ఈ నేను కోసమే బతుకుతున్నాడు, ఆ నేనులో ఏదో విశేషం ఉంది అనుకొంటున్నాడు. నీకు పరమేశ్వరుడి పట్ల భక్తి కుదిరితే, అంతర్యామిపట్ల ప్రేమ పెరుగుతూ ఉంటే ఈ నేను ఎందుకు పనికిరాదు అని అప్పుడు నీకు తెలుస్తుంది, అప్పటి వరకు తెలియదు, ఎవడైనా ఒక మాట మాట్లాడుతూ ఉంటే ఆ మాట ఎందుకు మాట్లాడుతున్నాడు, దాని వెనకాల భావన ఏమిటి అని మనం చూడాలి.

మనం లోకానికి దగ్గరగా ఉన్నాము కాని ఈశ్వరుడికి దగ్గరగా లేము. మనం చెడ్డ విషయాలకు మొఖం చూపిస్తున్నాము, మంచివిషయాలకు వీపు చూపిస్తున్నాము. ఇంక

మనకు భక్తి ఏమిటి? జ్ఞానం ఏమిటి? మీకు ఇష్టమైనమార్గంలో ప్రయాణించి మనోచాపల్యాన్ని తగ్గించుకోండి. మీరు ఇంటి దగ్గర ఏదైనా పని చేస్తున్నా శ్రద్ధగా, మనస్సును అక్కడ పెట్టి చేయండి. ఈ సృష్టిరూపంలో ఉన్నవాడు కూడా భగవంతుడే. మనకు కనిపించే దానికి కారణం ఆయనే. కారణం లేకుండా కార్యం రాదు. ఈ సృష్టిని నియమించే యజమాని ఒకడు ఉన్నాడు అని వాడిమీద విశ్వాసం పెంచుకొనేవరకూ మీకు దేహాభిమానం తగ్గదు. నీవు సత్కర్మ ఆచరించకపోతే, ఈశ్వరుడిపట్ల భక్తి లేకపోతే అజ్ఞానంలో నుండి విడుదల పొందాలి అనే తలంపు కూడా నీకు రాదు. దైనందిన జీవితంలో మన భక్తిని కేవలం పూజ గదికే పరిమితం చేయకూడదు. జీవుడు రూపంలో కూడా దేవుడే. అందుచేత మనం జీవకోటికి ఎంతోకొంత ఉపయోగపడుతున్నప్పటికీ దానివలన మనం వికశిస్తాము. ఎదుటి మనిషిని చూసినప్పడు వాడి రంగును, మనస్సును, గుణాన్ని చూడవద్దు, అంతర్యామిగా ఉన్న పరమాత్మను చూడు, ఈ జీవుడికి ఆధారంగా ఉన్నవాడు ఆయనే. దుఃఖం అనేది నీవు చేసే పనిలో లేదు, నేను చేస్తున్నాను అనే తలంపులో ఉంది. కర్తృత్వం వలన దుఃఖం వస్తుంది కాని పని వలన నీకు దుఃఖం రాదు. కర్తృత్వం లేని కర్మ చేస్తూ ఉంటే నీకు దుఃఖం రాదు, అశాంతి రాదు. ప్రతీ మనిషికి ఏదో రూపం ఉంటుంది, నామం ఉంటుంది. ఆ నామంతోటి, రూపంతోటి తాదాత్మ్యం పొందకుండా నువ్వు పనిచేస్తూ ఉంటే నీకు చిత్త శుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి అనే గేటులో నుండే మనం మోక్షంలోనికి వెళ్ళాలి. విశ్వాసానికి భగవంతుడు ఎంత ప్రాముఖ్యత ఇచ్చి చెపుతున్నాడో చూడండి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, కర్మఫలాన్ని పంచిపెట్టేవాడు ఒకడు ఉన్నాడు అని వాడిపట్ల మనకు సజీవమైన విశ్వాసం ఉంటే మీరు దురాచారులు అయినప్పటికీ మీ బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే వాటిలో నుండి మిమ్మల్ని విడుదలచేసి, ఆవు దూడను ఏవిధంగా అయితే నాకుతుందో అలాగే జీవుడిలోఉన్న దోషాలను భగవంతుడు నాకి, రాంగ్‌తింకింగ్‌లో నుండి మనలను విడుదలచేసి మనకు మోక్షాన్ని ఇస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. ఇందులో సందేహం వద్దు. అంటే అక్కడ విశ్వాసం ప్రధానం, విశ్వాసంలో మటుకు ఊగిసలాట ఉండకూడదు. మనం కర్మ మార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా భక్తి సపోర్టుగా ఉండాలి, ప్రేమ సపోర్టుగా ఉండాలి, మనం ఏదైనా పని చేస్తున్నాము అనుకోండి భక్తితోటి చేసిన పని ఒక రకంగా ఉంటుంది, భక్తి లేకుండా చేసింది ఒకరకంగా ఉంటుంది. మనం యాంత్రికంగా పనులు చేస్తాము. అలా కాకుండా భక్తితో, ప్రేమతో పనులు చేస్తే ఆ పనులు

పూర్తి అయిపోతాయి, అదనంగా వచ్చే లాభం ఏమిటి అంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది.

శ్రద్ధ లేకుండా మనకు జ్ఞానం కలుగదు. సత్పురుషుల సహవాసం వలన, ఆహార నియమంవలన, ఈశ్వరుని పాదాలయందు భక్తి కలిగి ఉండటం వలన మనకు శ్రద్ధ కలుగుతుంది. ఏ రోజున మన శరీరం పోతుందో చెప్పలేము అందుచేత మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. మనకు నేను అనే తలంపు ఉంది. ఆ నేనును ఎవరైనా భంగం చేసారు అనుకోండి వెంటనే వారికి దూరమయిపోతాము. నేను ఏదో పార్టీలో పనిచేస్తున్నాను అనుకోండి. నాకు ఏదీ పదవి ఇవ్వరు అనుకోండి వెంటనే ఆ పార్టీ వదిలేస్తాను అంటే అక్కడ పార్టీ ముఖ్యం కాదు, దేశం ముఖ్యంకాదు, ఈ నేను ముఖ్యం. మొత్తం ఈ సృష్టి అంతా కూడా నేను అనే ఒంటిస్థంభం మీద ఆధారపడి ఉంది. భగవాన్ ఏమని చెప్పారు అంటే ఈ నేను ఉంటే అంతా ఉంది నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, దేవుడు ఉన్నాడు, పుణ్యం ఉంది, పాపం ఉంది, లోకాలు ఉన్నాయి, ధర్మం ఉంది, అధర్మం ఉంది, జన్మలు ఉన్నాయి అన్నీ ఉన్నాయి, ఈ నేను లేకపోతే ఏదీలేదు, ఉన్నది ఒక్కటే. ఎంత వండర్‌ఫుల్‌గా ఉందో చూడండి. దేవుడు ఉన్నాడా, లేడా అన్నది సమస్య కాదు. ఉన్నదేదో ఉంది. ఆ ఉన్నదానిని నీవు కనిపెట్టటం ఎందుకు? ఆ ఉన్నదానిని నీవు ఎరుకలోనికి తెచ్చుకోవటమే. ఇప్పుడు నీవు శరీరంతో, మనస్సుతో ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో అలాగ ఉన్నవస్తువుతో తాదాత్మ్యం పొందటమే, ఉన్నదానిని ఉన్నట్లుగా గుర్తించటమే ట్రూత్ రియలైజేషన్. సుఖం కోసం మీరు బజారులో వెదకవద్దు. ఈశ్వరుడిని ప్రేమించండి. ఈశ్వరుడిని ప్రేమించగా ప్రేమించగా ఆయనే మీకు సుఖ స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఈశ్వరుడిని ప్రేమించండి అంతకంటే మీరు ఎక్కువ కష్టపడనక్కరలేదు. కర్మఫలం పట్ల ఎక్కువ ఆసక్తి ఉన్నవారికి భగవంతుడు చెప్పిన మాటలు చేదుగా ఉంటాయి, నోటిలో ఆముదం పోసుకొన్నట్లుగా ఉంటుంది. మనస్సు చల్లబడకుండా దానికి లోచూపు రాదు, దానికి లోచూపు వస్తేగాని ఆత్మజ్ఞానం రాదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-11-2007, జువ్వలపాలెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ముఖ్యంగా విష్ణువును, శివుడును ఆరాధిస్తూ ఉంటాము. విష్ణువు మోక్షాన్ని ఇస్తాడని, శివుడు జ్ఞానాన్ని ఇస్తాడని మన పురాణాలు చెబుతున్నాయి. మోక్షం అన్నా, ఆత్మజ్ఞానం అన్నా ఒక్కటే. మోక్షం అనే శబ్దానికి అర్థం ఏమిటి అంటే విడుదల, విడుదల అంటే దేహంలో నుండి విడుదల కాదు, దేహబుద్ధిలో నుండి దేహము నేను అనే తలంపులో నుండి విడుదల.

జీవితం అంతా తలంపులే. అన్ని తలంపులు దేహము నేను అనే తలంపులో నుండి వస్తున్నాయి. గాఢనిద్రలో మనకు ఈ తలంపుల గొడవ లేదు, అన్ని తలంపులలో నుండి విడిపోతున్నాము. గాఢనిద్రలో దేహములోనుండి, మనస్సులోనుండి, అన్ని తలంపులలోనుండి ఎలా విడిపోతున్నావో అలాగ జాగ్రదవస్థలో విడిపోతే అదే ఆత్మజ్ఞానం, అదే మోక్షం. ఏవో కబుర్లు చెప్పటం వలన ఇది సాధ్యం కాదు. ఒక చెట్టు చావాలంటే వేరుతో సహా లాగితేనే గాని అది నశించదు. అలాగే దేహము నేను అనే తలంపును వేరుతో సహా పెకిలించాలి. ఊరికే ఆకులు కోస్తే, కొమ్మలు నరికేస్తే లోపల వేరు ఉన్నంతసేపు వర్షాకాలం వచ్చేటప్పటికి మరల మొక్క వచ్చేస్తుంది. దేహము నేను అనే ప్రధాన తలంపును వేరుతో సహా ఎవడైతే పెకిలించగలుగుతున్నాడో వాడికి మాత్రమే అది కడసారి జన్మ, వాడు ఆత్మజ్ఞానానికి అర్హుడు.

గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీరు కష్టపడి సాధన చేసుకోండి, మీకు మానవ దేహం వచ్చింది, కాలాన్ని వృథా చేసుకోవద్దు. ఈ దేహం భూమి మీదకు ఏపని నిమిత్తం వచ్చిందో ఆ పని పూర్తి అయిన వెంటనే దేహం రాలిపోతుంది. మీరు ఎలా రాలిపోవాలో చెప్పమంటారా? దోసకాయ బాగా పండాక ఆ తీగనుండి దాని అంతట అదే విడిపోతుంది, ఎవరూ కొయ్యనక్కరలేదు. పండు నాలోనుండి విడిపోయింది అని తీగకు ఏమీ తెలియదు, బాధ అనిపించదు. దోసకాయ తయారయ్యాక తీగలో నుండి ఎంత సహజంగా విడిపోతుందో అంత సహజంగా మనం దేహాభిమానంలో నుండి విడిపోతే జీవన్ముక్తి స్థితిని పొందుతాము. మన బుద్ధిని పక్వం చేసుకొని దేహాభిమానాన్ని తగ్గించుకొంటే దేహం ఉండగానే దేహాభిమానంలో నుండి విడిపోతావు, అప్పుడు శాంతి కలుగుతుంది, ఆనందం కలుగుతుంది, మరణం తాలుక భయం పోతుంది. మనకు దేహం ఉంది, ఇంద్రియాలు ఉన్నాయి, మనస్సు ఉంది. వీటిని మనం జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మనం ఇంద్రియాలను కంట్రోలులో ఉంచుకోకపోతే పతనమయిపోతాము. అందుచేత ఇంద్రియాలను జాగ్రత్తగా నియమించుకోవాలి. మనం ఎవరినీ అసహ్యించుకోకూడదు. కొంతమంది పూజలు చాదస్తంగా చేస్తారు. దాని వలన వారి మనస్సు నిర్మలం అయితే మంచిదే కాని మనం వారిని ఆక్షేపించకూడదు, ఏదో రకంగా వారు బాగుపడటం ముఖ్యం. అందరూ మనలను ప్రేమించరు, కొంతమంది ద్వేషిస్తూ ఉంటారు, ఆ ద్వేషానికి అనేక కారణాలు ఉండవచ్చు, ఆ ద్వేషాన్ని మనం సహించాలి, దాని వలన మనకు అశాంతి రాకుండా చూసుకోవాలి, యిక్కడ వెంకటేశ్వర పెరుమాళ్ళ విగ్రహం స్థాపించారు. ఇక్కడకు వచ్చి

స్వామిని చూసేటప్పటికి నా సాధనతో నిమిత్తం లేకుండా, నా ప్రయత్నంతో సంబంధం లేకుండా నా మనస్సును దొంగతనం చేసారు. నా మనస్సును దొంగతనం చేసి పట్టుకొనిపోతే ఇంక నాకు గొడవ ఏముంది? గొడవలన్నీ మనసులోనే ఉన్నాయి కదా. దానిని ఎవడో దొంగతనము చేసి పట్టుకొనిపోతే పీడ వదిలిపోతుంది. కృష్ణుడు వెన్నపూస తిన్నాడు అంటే ఎవడి మనస్సు అయితే పవిత్రం అయిందో, మృదువుగా అయిందో దానిని భుజిస్తాడు, తస్కరిస్తాడు. అంటే ఎందుకు పనికిరాని మన మనస్సును ఆయన తీసుకొని, ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు.

మనం అన్నీ సంపాదించుకొంటున్నాము కాని భగవంతుడి దయను సంపాదించుకోవటం లేదు. ఈ దేహాన్ని ఇచ్చినవాడు పరమాత్మ. ఈ దేహాన్ని ఎవడైతే ఇచ్చాడో ఆయనను పూజించుకోవటం, ఆయనను స్మరించుకోవటం మానేశాము ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు. పూర్వజన్మలలో మనం ఎంతో కొంత ఉపాసన చేసి ఉంటే, సత్కర్మ చేసి ఉంటే ఈ రోజున మన మనస్సు భగవదభిముఖంగా ప్రయాణం చేసి ఉండేది. అందుచేత ఉపాసన ముఖ్యం. భక్తి కూడా అంత తేలికగా రాదు. మంచి సంస్కారం ఉండాలి, విశ్వాస పాత్రులు అయి ఉండాలి, మంచితలంపులు ఉండాలి, ప్రోపర్ బిహేవియర్ ఉండాలి, ఇవన్నీ ఉంటేగాని భక్తి కలుగదు. సర్వసాధారణంగా మనం ఇంట్లో వారి మీద ఎక్కువ మమకారం పెట్టుకొంటాము. వారిపట్ల మన డ్యూటీ చేయాలి గాని మమకారం పెట్టుకోకూడదు. వారిపట్ల ఎక్కువ అభిమానం పెట్టుకోవటం వలన వారు పెద్దవారు అయిపోరు, వారి దేహానికి ప్రారబ్దం ఉంటుంది, ప్రారబ్దాన్ని బట్టి వారు తయారవుతారు గాని మీరు అభిమానం పెట్టుకోవటం వలన గొప్ప స్థితిలోనికి రారు. అందరికీ కుటుంబాలు ఉన్నాయి. కుటుంబ సభ్యుల పట్ల మన ధర్మం మనం నిర్వర్తించాలి అంతేగాని మమకారం పెట్టుకోకూడదు. మీకు నలుగురు సంతానం ఉంటే అందరూ ఒకేరకంగా ఉండరు. వారికి మీరు దేహాన్ని ఇచ్చారు అంతే, ఆ దేహప్రారబ్దాన్ని బట్టి వారు వెళ్ళిపోతూ ఉంటారు. స్నేహితులతో ఎక్కువ అభిమానం పెట్టుకోవద్దు, విరోధులతో మానసికంగా దూరంగా ఉండండి. వారికి మనం విరోధులు అయి ఉండవచ్చు కాని మనకి వారు విరోధులుగా ఉండనక్కరలేదు. వారు మనతో ఎందుకు విరోధంగా ఉంటున్నారు, వారు మనలను ఎందుకు ద్వేషిస్తున్నారు అని అటు వెళ్ళకండి. మన వరకే మనం చూసుకోవాలి. జ్ఞానం అనేది స్వతంత్రంగా ఉంటుంది. జ్ఞానంలో విరోధులుగాని, స్నేహితులుగాని, కుటుంబసభ్యులుగాని ఎవరూ లేరు,

దాని వైభవం అటువంటిది.

భగవంతుడికంటే మన క్షేమం కోరే వారు ఎవరూ లేరు. వారు మా క్షేమం కోరుతున్నారు, వీరు మా క్షేమం కోరుతున్నారు అంటే ఇవన్నీ అజ్ఞానంతోటి, అహంకారంతోటి కూడిన ప్రేమలే. రామానుజుడు కూడా తిరిగే అతను ఒక అమ్మాయిని ప్రేమించాడు. వాడు రామానుజుడుతో ఏమి చెప్పాడు అంటే నేను మీతో తిరుగుతున్నాను కాని నా మనస్సు ఆ అమ్మాయి దగ్గరికి పోతోంది అని చెప్పాడు. ఎందుకు నీ మనస్సు అలా వెళ్ళిపోతోంది అంటే ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది అని చెప్పాడు. అప్పడు రామానుజుడు వాడిని గుడిలోనికి తీసుకొని వెళ్ళి రంగనాథుని నేత్రద్వయాన్ని వాడికి చూపించి నువ్వు ఇలా నాలుగు రోజులు వచ్చి చూసివెళుతూ ఉండు. రంగనాథుని నేత్రాలకంటే నువ్వు ప్రేమించిన అమ్మాయి అందంగా ఉంటే పెళ్ళి చేసుకొందువుగాని అని చెప్పాడు. అలా నాలుగు రోజులు రంగనాథుని వైభవం చూసేసరికి మానసికంగా ఆ అమ్మాయిని వదిలేసాడు, ఇంక పెళ్ళి లేదు ఏమీలేదు, ఆ తలంపు పోయింది, మారుమనస్సు పొందాడు. ఆ భక్తుడిలో ఉన్న కల్మషాన్ని, ఆ వికారాన్ని అంతా తీసేసాడు, అది రంగనాథుడు చేసిన ఉపకారం. కిరసనాయిలు డబ్బాలో కిరసనాయిలు అంతా తీసేసిన తరువాత కూడా ఆ డబ్బా కిరసనాయిలు వాసన కొడుతూనే ఉంటుంది. అలాగే నీవు ఏవో సాధనలు చేస్తూ పవిత్రంగా ఉన్నప్పటికీ వాసనాక్షయం పూర్తి అయ్యేవరకు నీకు ఆత్మజ్ఞానం సాధ్యంకాదు. నెమ్మది నెమ్మదిగా మనస్సును స్వాధీనం చేసుకొంటూరా. ఇది తొందరపడితే వచ్చేది కాదు. గత జన్మలనుండి వచ్చిన వాసనలు అనేకం ఉంటాయి. వాటి యొక్క వేగాన్ని తట్టుకోవటానికి నీవు చాలాపట్టుదలతో సాధన చేయాలి. దీనికి వైరాగ్యం అవసరం. అసలు వైరాగ్యం లేకుండా మటుకు మనం సక్సెస్ అవ్వలేము. మన మనస్సుకు అంతర్దృష్టి రాకపోవటానికి, మనకు ఆత్మజ్ఞానం రాకపోవటానికి ఎటాచ్‌మెంట్ కారణం. ఈ ఎటాచ్‌మెంట్ పెద్దపాపం.

వైరాగ్యం అనేది చెడ్డది అనుకొంటాము. అది చెడ్డది కాదు. వైరాగ్యం వలన దేహానికి ఆరోగ్యం కలుగుతుంది, మనస్సుకు కొంత విశ్రాంతి కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. బయట ఉన్నదానికి ఆరోగ్యం, లోపల ఉన్నదానికి ఆనందం ఇవి వైరాగ్యం వలన వచ్చే లాభాలు. మనస్సును లోపల ఉంచాలి అని ఉంది కాని అది బయటకు వచ్చేస్తోంది అని చాలామంది అంటారు. నీ మనస్సులో ఉన్న దుమ్ము, నీ మనస్సులో ఉన్న కోరికలు నీకు తెలియటానికి దానిని బయటకు గెంటేసి అప్పడు నువ్వు ఎలాగ ఉన్నావో లోపల ఉండి ఆయన సాక్షిగా

చూస్తూ ఉంటాడు. వాడే పరమాత్మ. ఇది ఒక ట్రైనింగ్ గ్రౌండ్. మనం ట్రైనింగ్ పొందటానికే ఇక్కడికి వచ్చాము. ఇటువంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి? చెడ్డ కోరికలు వస్తున్నాయి ఏమిటి అని నీవు అనుకొంటున్నావు కాని భగవంతుడి పాదాలయందు భక్తి కుదిరితే, ఆయన నామాన్ని నిరంతరం స్మరిస్తూ ఉంటే, ఆయన పట్ల గౌరవం కలిగి ఉంటే నీ మనస్సు ఇతర తలంపుల మీద వాలకుండా ఆయననే ఆశ్రయించి ఉంటుంది, అప్పుడు మనస్సు నశిస్తుంది. అయితే భగవంతుడి మీద మనకు ప్రేమ లేదు, భక్తి లేదు. మనం అంతా ఆయనలో నుండే వచ్చాము. మన నిజమైన తండ్రి భగవంతుడే అనే భావన మనకు లేదు. అయ్యో మనకు ఈ దేహాన్ని ఇచ్చాడు, ఆరోగ్యాన్ని ఇచ్చాడు. వయస్సులో ఉన్నప్పుడే, ఆరోగ్యం బాగా ఉన్నప్పుడే ఆయనలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేయాలనే బుద్ధి మనకు రావటం లేదు. ప్రతీ మనిషి కూడా వాడు ఏదో ఊహించుకొంటాడు, వాడు ఏదో కల్పించుకొంటాడు, వాడే వెళ్ళి బంధంలో పడతాడు. ఆ బంధంలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయటం, దానికి సాధన అని పేరు పెట్టటం, జరిగేది ఇది.

నువ్వు నిరంతరం భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, విషయచింతన లేకుండా ఆత్మ చింతన చేస్తూ ఉంటే నీ యోగక్షేమాలను ఆయనే చూసుకొంటాడు. నీకు తలకాయపోటు వస్తే తలకాయ తీసేసుకోవు. తలపోటు తగ్గించమని డాక్టరుగారిని అడుగుతావు. అదేవిధంగా మీకు రజోగుణం, తమోగుణం ఎక్కువగా ఉంటే చనిపోనక్కరలేదు, వాటిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయండి. మనలో ఏమైనా గుణాలు ఉంటే వాటిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయాలిగాని శరీరాన్ని చంపేయనక్కరలేదు. నీలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకో, ఏ గుణాలు ఉన్నాయో చూసుకో, ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖం అవుతోందో చూసుకో, వాటిలో నుండి నీ మనస్సును మళ్ళించి, ఆ గుణాలకు బలహీనతలకు అన్నింటికి నీ వీపు చూపించాలి, భగవంతుడికి నీ మొఖాన్ని చూపించి భగవంతుడి వైపుకు నడవవయ్యా. భగవంతుడికి మొఖం చూపించాలి, విషయాలకు వీపు చూపించాలి. అప్పుడు భగవంతుడిని పొందటం నీకు సాధ్యమే. వేదంలో ఒక మాట ఉంది. విత్తనం లేకుండా చెట్టు రాదు. చెట్టుకు విత్తనం ఎటువంటిదో, నీ మనస్సుకు లోపల కామం అటువంటిది, కామం అంటే కోరిక. ఆ కామ బీజం నశించకుండా ఎన్ని జన్మలు ఎత్తినా వృక్షం అలాగే ఉంటుంది అంటే మనస్సు అలాగే ఉంటుంది, దానిని నీవు నశింపచేయలేవు. జ్ఞానం సంపాదించుకోవటానికి మనం ప్రయత్నం చేసేటప్పుడు

రేపు, రేపు అనుకొంటాము. వారు సాగనివ్వటం లేదు, ఇంట్లోవారు సాగనివ్వటం లేదు అని ఏదో వంపు చెపుతూ ఉంటాము. సాధన చేసేవారు ఎలా చెయ్యాలో ఇక్కడ చెపుతున్నారు. ఇప్పుడు మనం ఇటుకావ (ఇటుకలు కాల్చే బట్టీ) మీద కూర్చొన్నాము అనుకోండి. దానికి నిప్ప పెట్టారు అనుకోండి. కొంత టైము అక్కడ కూర్చొందాము, రేపు బయటకు వద్దాము ఇలా అనుకోము. ఇటుకావకు నిప్ప పెట్టినవెంటనే తొందరగా అక్కడ నుండి ఉరికేసి బయటకు వచ్చేస్తాము. ఇటుకావ మీద కూర్చొన్నవాడు దానికి నిప్ప పెట్టిన వెంటనే ఎంత తొందరగా అక్కడి నుండి బయట పడాలని చూస్తాడో అలాగ నీ అజ్ఞానంలో నుండి, ఈ బంధంలో నుండి బయటకు రావటానికి అంత వేగంగా, అంత తీవ్రంగా, అంత కట్టుదిట్టంగా ప్రయత్నం చెయ్యాలి అని బుద్ధుడు చెప్పాడు. టైమును పాడుచేసుకోవద్దు, శక్తిని వృధా చేసుకోవద్దు.

బుద్ధుడిలో నేర్చుకోవలసింది ఏమిటి అంటే ఆయనలో ఎక్కడ వ్యక్తిభావన కనబడదు, ఆ వాసన కూడా ఎక్కడా కనబడదు. చలిఅనక, ఎండఅనక, వానఅనక చాలా సంవత్సరాలు తిరిగి జ్ఞానాన్ని బోధించాడు, అంత కరుణామయుడు. నువ్వు ఎంత అజ్ఞానంతో, దుర్వాసనలతో ఉన్నప్పటికీ నిన్ను చెడ్డవాడికింద ఎప్పుడూ చూడలేదు. ఆయన చూపు వలన మనలో ఉన్న అజ్ఞానం అంటుకొనేది. కేవలం ఆయనను దర్శించటం వలన చాలామంది ఆత్మజ్ఞానం పొందారు అని చెపుతారు. బుద్ధుడి కూడా ఆయన చవితి తమ్ముడు ఆనంద్ ఉండేవాడు. మీ శరీరం చనిపోయిన తరువాత ఈ శరీరాన్ని ఏమి చేయమంటారు అని ఆనంద్ బుద్ధుడిని అడుగుతాడు. బుద్ధుడు చెప్పిన మాట నన్ను ఆశ్చర్యచకితుడిని చేసింది. మోస్ట్ ఇంపెర్సనల్ లైఫ్. ప్రతీ గ్రామానికి ఒక స్మశానం ఉంటుంది కదా. ఆ గ్రామంలోని శవాలను ఏ స్మశానంలో అయితే దహనం చేస్తున్నారో ఈ శరీరాన్ని కూడా తీసుకొని వెళ్ళి అక్కడ దహనం చెయ్యి. బుద్ధుడి శరీరాన్ని ఫలానా చోట దహనం చేసారు అని ఈ లోకానికి ఏమీ గుర్తు అక్కరలేదు అని చెప్పాడు. వాడు బుద్ధుడు. తరువాత వచ్చిన రాజులు ఆయన అస్థికల కోసం పేచీలు పడ్డారు. అస్థికలను వాటాలుగా చేసి వారి వారి ప్రాంతాలకు తీసుకొని పోయారు. ఏదో బంగారం కోసం వెళ్ళినట్లు అస్థికలు మాకు కావాలి, మాకు కావాలి అన్నారు అంటే ఆయన దేహం దేవాలయం అయిపోయింది లేకపోతే అస్థికలకోసం అంతమంది పేచీలు ఎందుకు పడతారు. కోడిపిల్లలు గెద్దలను చూస్తే పారిపోతాయి అలాగ పారిపోయే మనుషులం మనం. ఇటువంటి పిరికివారికి, బుద్ధి తక్కువ వారికి బుద్ధుడి యొక్క వైభవం

ఎలా తెలుస్తుంది అన్నారు స్వామీజీ. మనవి చిన్న చిన్న మనస్సులు, మన ఆలోచనలు చాలా కురచగా ఉంటాయి. మానవజాతి మీద ఆయనకు ఉన్న అపూర్వమైన ప్రేమ, ఇంద్రియాతీతమైన ప్రేమ మనలాంటి చిన్నవారికి అర్థంకాదు అని స్వామీజీ చెప్పారు.

కనిపిస్తున్న వస్తుజాలాన్ని ఎలా ఎంజాయ్ చేస్తున్నారో, తినే తినుబండారములను ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అలాగ మౌనాన్ని ఎంజాయ్ చేయటం నేర్చుకోండి, ఏకాంతవాసాన్ని ఎంజాయ్ చేయటం నేర్చుకోండి. ప్రతిరోజు ఒక గంటైనా ఏదో గదిలో కూర్చొని కుటుంబసభ్యులతో సంబంధం లేకుండా ఏకాంతంగా ఉంటే అప్పుడు మన మనస్సులో ఏముందో మనకు తెలుస్తుంది, మనలో ఉన్న బలహీనతలు మనకు తెలుస్తాయి. ముందు ఆ బలహీనతలు మనకు తెలిసాక అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయవచ్చు. జ్ఞానం అంటే అది పైనుండి పోసేది కాదు లోపలనుండి ఊరేది. ఈశ్వరుడి పాదాలయందు నీకు భక్తి ఉంటే, ఉపాసన ఉంటే, తపన ఉంటే జ్ఞానం లోపల నుండి ఊరుతుంది. ఎక్కడైతే జ్ఞానం ఉందో, ఎక్కడైతే ఒక మనిషిలో వైభవం ఉందో అది అంతా నా విభూతి, నా ప్రసాదమే అన్నాడు పరమాత్మ. ఎవరికైనా జ్ఞానం కలిగింది అనుకోండి అంది అంతా ఆయన అనుగ్రహమే. ఆయన అనుగ్రహం లేకుండా వాడికి ఆ శక్తి కలుగనే కలుగదు. నిష్కామకర్మ చేస్తూ ఉంటే ఆయన అనుగ్రహం కలుగుతుంది. ఆయన అనుగ్రహం కలిగాక ఆయన పట్ల భక్తి కలుగుతుంది, ఆ భక్తిలో నుండి జ్ఞానం ఊరుతుంది. భక్తి జ్ఞానానికి తల్లి, భక్తి లేకుండా జ్ఞానం రాదు. భగవాన్‌ను ఒక భక్తుడు అడుగుతున్నాడు. మీరు ఏదో మనస్సు అంటున్నారు, అహంకారం అంటున్నారు, నకిలీ నేను అంటున్నారు, దానిని పోగొట్టుకోవాలి అంటున్నారు. మీరు నాకు భక్తిని ప్రసాదించండి. మీరిచ్చే భక్తిలో ఈ మనస్సు శేషం లేకుండా కాలిపోవాలి. ఆ మాత్రం భక్తిని ప్రసాదించండి అంతకంటే అదనంగా వద్దు అంటున్నాడు. ఆ మాత్రం భక్తి ఇస్తే చాలు అంటే దాని అర్థం పూర్తిగా ఇచ్చేసినట్లే కదా. మనస్సు శేషం లేకుండా నశిస్తే ఇంక ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం, అదే ఆత్మ.

పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే బతుకు. ఆయన నీకు గోచరం కాకపోవచ్చు, అది వేరే విషయం. ఎందుచేతనంటే అతీంద్రియస్థితి పొందినవాడికి కాని ఆయన గోచరించడు. మనస్సుకు పరిమితమై జీవించేవాడికి, దేహానికి పరిమితమై జీవించేవాడికి, ఇంద్రియాలకు పరిమితమై జీవించేవాడికి ఎవడికీ భగవంతుని సాక్షాత్కారం కాదు. అందుచేత నీవు నమ్మిన, నమ్మకపోయిన ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు.

అయితే ఆయన ఉన్నాడు అని చెపితే సరిపోదు. ఆయన పట్ల నీకు ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి. ఆయన పట్ల విశ్వాసం కలిగి ఉంటే, పరిపూర్ణమైన భక్తి కలిగి ఉంటే ఆయన పాదాలను ఆశ్రయిస్తే మనకు మాయ దారి ఇస్తుంది, అప్పుడు పరమేశ్వరుడు మనకు గోచరిస్తాడు. చేపలు పట్టేవాడు వల వేస్తాడు అనుకోండి. వాడి పాదాల దగ్గర ఉన్న చేపలు ఆ వలలో పడవు, వాడికి దూరంగా ఉన్న చేపలే ఆ వలలో పడతాయి. అలాగ ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఈశ్వరుడి మాయలో నీవు పడవు. ఇవి అన్నీ మీరు వింటే సరిపోదు, వీటిని ఇంటికి వెళ్ళి మననం చేయాలి. భక్తి అంటే చాలా తేలిక అని చాలామంది అనుకొంటున్నారు, భక్తి కూడా అంత తేలికగా రాదు. పూర్వ పుణ్యం లేకపోతే రంపం పెట్టి కోసినా వాడికి భక్తి రాదు. పూర్వ పుణ్యం ఉండాలి, భగవంతుడి దయ అనే కెరటం ఆయన పాదాల దగ్గరకు మనలను గెంటుకొని రావాలి కాని మన సాధనల వలన అక్కడికి మనం చేరుకోలేము, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడని విశ్వాసం పెట్టుకొని, భక్తిని సంపాదించుకొని, ఆయన పాదాలను ఆశ్రయిస్తే ఈ ప్రకృతి గుణాల నుండి, మాయలోనుండి బయటకు వచ్చి మనం తరించే అవకాశం ఉంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-11-2007, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సృష్టి అంతా వాసుదేవస్వరూపమే అని తెలిసినవాడికి పునర్జన్మ లేదు అని పరమాత్మ చెప్పాడు. ఈ సృష్టి అంతా కూడా వాసుదేవస్వరూపమే అని నోటితో చిలుకపలుకులు పలకటం కాదు, ఇదంతా వాసుదేవ స్వరూపమే అని గుర్తించినవాడికి పునర్జన్మ లేదు, మరి ఆ జన్మ ఎప్పుడు వస్తుందో చెప్పలేము. మహావిష్ణువును గాని, మహాదేవుడినిగాని మనం ఉపాసన చెయ్యాలి. అంటే ఆ నామాన్ని స్మరించటం, ఆ రూపాన్ని ధ్యానం చేయటం దానినే ఉపాసన అంటారు. ధ్యానం వలన మనకు ఏకాగ్రత వస్తుంది. లోపల అంతఃకరణ శుద్ధిఉంటేగాని భగవాన్ మాటలు అర్థం చేసుకోవటం కష్టం లేకపోతే తిరకాసు వచ్చేస్తుంది. కర్మసిద్ధాంతం నిజమే అంటారు. మనం పుణ్యం చేస్తే పుణ్యఫలం సుఖం, పాపం చేస్తే పాపఫలం దుఃఖం, ఇవి అనుభవిస్తే బయటకు పోతాయి. భగవాన్ ఏమి చెప్పారు అంటే మీకు పరిస్థితులు బాగున్నాయి అనుకోండి పొంగిపోవద్దు, మీరు అనుకొన్న పనులు అవ్వటంలేదు అనుకోండి కుంగిపోవద్దు. మీరు గ్రహించవలసింది ఏమిటి

అంటే మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా ఇవి రెండూ దొంగనేనుకే. ఆ దొంగనేను మీరు కాదు. లోపల ఉన్న బ్రహ్మపదార్థానికి సంతోషం లేదు, దుఃఖం లేదు, వీటితో దానికి ఏమీ సంబంధం లేదు. మీకు సంతోషం వచ్చినప్పుడు పొంగిపోతూ ఉంటే, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోతూ ఉంటే వీటివలన దొంగనేను పెరిగిపోతుంది. అందుచేత దొంగ నేను ఉంటే కర్మ సిద్ధాంతంగాని దొంగనేను లేకపోతే కర్మసిద్ధాంతానికి విలువలేదు అని చెప్పారు. దొంగ నేనును దాటినవాడు కర్మసిద్ధాంతాన్ని దాటి వెళ్ళిపోతాడు, ఇంక వాడికి పునర్జన్మ లేదు. ఈ దొంగనేను ఏమి చేస్తుంది అంటే యింద్రియాల ద్వారా బయటకు వచ్చేసి విషయాలలో తిరుగుతూ ఉంటుంది. ఈ శరీరం ముసలిది అయిపోయిన తరువాత, ఇది పనికి రాదు అనుకొన్నప్పుడు కొత్త శరీరం కోసం చూస్తుంది. ఈ శరీరం చనిపోకముందే దొంగనేను చనిపోతే ఇంక మనకు కొత్తశరీరాలు రావు, అదే మోక్షం.

మనస్సు అంటేనే మాయ. అది రకరకాలుగా ఉంటుంది. ఒకోరోజున మనం మంచిగా ఉంటాము, ఒకోరోజున చెడుగా ఉంటాము, ఒకోసారి కోపంగా ఉంటాము. ఒకోసారి అందరికీ ఉపకారం చేయాలని అనిపిస్తుంది, వీరికి మనకు సంబంధం ఏమిటి వీరికి ఎందుకు మనం ఉపకారం చేయాలని ఒకోసారి అనిపిస్తుంది ఇలా మనస్సు రకరకాలుగా ఉంటుంది. మనస్సు ఎలా ఉంటుందో శాస్త్రంలో చెప్పారు అసలే అది కోతి, అది ఒకసారి కల్లు తాగింది, కల్లు తాగాక దానిని తేలుకుట్టింది, ఇంక ఆ కోతి ఎలా ఉంటుందో మన మనస్సు అలా ఉంటుంది అని చెప్పారు. వృక్షానికి మూలం బీజం, మనస్సుకు మూలం కామం అని చెపుతారు. చిన్న విత్తనంలో నుండి కొమ్మలు, రొబ్బలు, ఆకులు ఇలా పెద్ద వృక్షం వచ్చేస్తుంది. అలాగే కామ వాసనలో నుండి కోపం, అసూయ, ద్వేషం ఇలా పెద్ద మనస్సు వచ్చేస్తోంది. ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి అంటే మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా రావద్దు అని చెప్పకండి. దుఃఖం వచ్చినా ముట్టుకోవద్దు, సంతోషం వచ్చినా ముట్టుకోవద్దు. అప్పుడు దొంగనేను చనిపోవటం ప్రారంభమవుతుంది. మీ ఇంట్లో వారి పరిస్థితి బాగుంది అనుకోండి, అందులో కలవకండి, వారి ప్రారబ్దాన్ని బట్టి వారు బాగున్నారు, వారి ప్రారబ్దం బాగా లేక ఎక్కువ కష్టాలు పడుతున్నారు అనుకోండి. మీకు చేతనైతే సహాయం చేయవచ్చు గాని అందులో కలవవద్దు, బెంగ పెట్టుకోవద్దు. మనకు జ్ఞానం రాకుండా అడ్డుపడే పెద్ద శత్రువు మమకారం. అందుచేత మనం ఎవరికైనా ఏదైనా సహాయం చేయవచ్చు గాని మమకారంతో చేయకూడదు. మమకారంతో చేస్తే అది మనలను

బంధిస్తుంది. అందుచేత మమకారాన్ని తగ్గించుకో అని శాస్త్రంలో చెప్పారు. అహంకారం, మమకారం వలన హృదయంలో ఉన్న ఆత్మ మనకు తెలియటం లేదు. అహంకారం అంటే నేను, మమకారం అంటే నాది. ఎవరికో ఒక రూపాయి ఇవ్వటం, లేకపోతే ఇల్లు కట్టిపెట్టటం, లేకపోతే బట్టలు కొని ఇవ్వటం ఇవన్నీ ధర్మం అని మనం అనుకొంటున్నాము, ఇది వ్యవహారికం. కాని భీష్ముడు ధర్మరాజుతో ఏమని చెప్పాడు అంటే నువ్వు విష్ణుసహస్రనామాలను శ్రద్ధగా చదువుకొని ఆ నామాల యొక్క అర్థాలను తెలుసుకొని మనం పాయసం నోటిలో ఎలా పోసుకొంటున్నామో అలాగ ఆ నామాలలో ఉన్న అర్థాలను నువ్వు జుర్రుకొంటూ ఉంటే నీ మనస్సు అణుగుతుంది, అది నిజమైన ధర్మం అని చెప్పాడు. అంటే నీ మనస్సు అణగటమే నిజమైన ధర్మం.

మీ ఇంట్లో ఎవరైనా అభివృద్ధిలోనికి వస్తే నా వలననే అభివృద్ధిలోనికి వచ్చారు అనుకొంటారు. మీరు ఏదైనా సహాయం చేయగలరు అంతే. మీ చేత సహాయం చేయించినవాడు భగవంతుడే. అది తెలియకపోవటం వలన నేను చేసాను, నేను చేసాను అనుకొంటున్నారు. ఈ నేను అనే బుద్ధిని భగవంతుడు తొక్కిపెట్టి ఉంచుతాడు. మేము ప్రాణాయామం చేస్తున్నాము, యాత్రలు చేసాము, యజ్ఞాలు చేసాము అంటే చేయటం మంచిదే కాని భగవంతుడు ఎక్కడైతే మిమ్మల్ని తొక్కిపెట్టి ఉంచాడో అందులో నుండి వాడి కాలు తీసేవరకు మీరు కోటి పుణ్యాలు చేసినా అందులోనుండి బయటకు రాలేరు. నేను పుణ్యం చేసాను, సుఖం వచ్చేస్తుంది, నేను స్వర్గలోకానికి వెళ్ళిపోతాను అనుకొనేవాడే గాని దేవుడిమీద గౌరవం ఎవరికి ఉంది, ప్రేమ ఎవరికి ఉంది, దేవుడి పాదాలను విడిచిపెట్టకూడదు అనే బుద్ధి ఎవరికి ఉంది, ఆ బుద్ధి మనకు లేనే లేదు. ఆయన దయ లేకుండా, ఆయన మీద మనకు గౌరవం లేకుండా ఈ పొరపాటులోనుండి మనం కోటిజన్మలు ఎత్తినా బయటకు రాలేము. మీ ఇంట్లో మిమ్మల్ని బాధలు పెడుతున్నారు అనుకోండి, సమాజపరంగా బాధలు వస్తున్నాయి అనుకోండి. ఎందుకు ఇలా బాధలు వస్తున్నాయి అంటే ఇది మీకు ఒక ట్రైనింగ్. వారు మిమ్మల్ని బాధపెడుతున్నారు అని భగవంతుడికి తెలుసు. ఆయన సర్వజ్ఞుడు, ఆయనకు తెలియని విషయం అంటూ ఏమీ లేదు. ఆ ట్రైనింగ్ మీకు లేదు అనుకోండి మనస్సుకు లోచూపు రాదు. మీకు బయట పరిస్థితులు బాగుంటే మంచిదే. మీకు వందకోట్ల డబ్బు ఉంది అనుకోండి, వంద చెరువులు తవ్వించారు అనుకోండి. మనస్సును బాగు చేసుకొనే పని మర్చిపోయారు అనుకోండి, ఇవన్నీ ఒకటి లేని సున్నలు. వీటి వలన మీకు పుణ్యం

వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది. మీరు చేసే మంచిపనుల వలన మనస్సు బాగుపడాలి. ఏవో మంచి పనులు చేస్తున్నాముకదా, మనస్సు ఎలా ఉంటే ఆ గొడవ ఎందుకు? అందరూ మెచ్చుకొంటున్నారు కదా అంటే ఇక్కడ ఊరేగింపులు ఉంటాయి, స్మశానానికి వెళ్ళినప్పుడు వందమంది ఎక్కువ వస్తారు, పరలోకానికి వెళ్ళినప్పుడు మీ పని సున్న. మన మనస్సును బాగుచేసుకోవటం కంటే మించిన పని ఏమీ లేదు అన్న సంగతి మనకు తెలియటం లేదు, ఇది మనందరము చేస్తున్న పొరపాటు.

ఒక విషయం గుర్తుపెట్టుకొని మీరు అందరూ ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఉన్న దానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇది నిశ్చయం. ఇవి మన బుద్ధికి అందని విషయాలు. ఉన్నది ఉన్నట్లుగా మనకు గోచరించి నప్పుడే అద్వైతానుభవం వస్తుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు గోచరించకుండా సీతమ్మగా, ఎల్లమ్మగా, పుల్లమ్మగా, రాజుగారిలా, రెడ్డిగారిలా ఇలా రకరకాలుగా అది కనిపిస్తోంది అనుకోండి అప్పుడు ద్వైతం వస్తుంది. ద్వైతం ఎప్పుడైతే వచ్చిందో అక్కడ నుండి మాయ ప్రారంభమవుతుంది, మోహం ప్రారంభమవుతుంది. మీరు ఏదైనా పొరపాటు చేసారు అనుకోండి, పొరపాటు చేసినప్పుడు నాకు కోపం వచ్చేయవచ్చు. ఆ పొరపాటు నేనే చేసాను అనుకొంటే ఇంక కోపం రాదు, ఎందుచేత అంటే కోపం ఎక్కడ నుండి వస్తోంది, కామం ఎక్కడ నుండి వస్తోంది అంటే వేరుభావనలో నుండి వస్తోంది. మనందరం ఒక్కటే కాని భగవంతుడు మనకు వేరుబుద్ధిని కలుగజేసాడు, ఆ వేరుబుద్ధే మాయ. లేనిది ఉన్న దానివలె కనిపించటం వలన వేరుబుద్ధి వస్తోంది. ఉన్నది ఉన్నట్లుగా మనకు గోచరం అయ్యేవరకు లేనిది ఉన్నదానివలె మనకు కనిపిస్తుంది. మనందరం ఒక్కటే అనుకొన్నప్పుడు కోరిక లేదు, ద్వేషం లేదు, మోహం లేదు. మనందరం ఒక్కటే అని తెలియకపోవటం వలన చిరాకులు, పరాకులు అన్నీ వస్తున్నాయి. మీ బిడ్డ ఏదైనా పొరపాటు చేస్తే దాని వలన ఎక్కువ కోపం తెచ్చుకోరు, వాడికి టీచ్ చేసి అందులో నుండి బయటకు తీసుకొని రావటానికి ప్రయత్నం చేస్తారు. అదే ఇతరులు పొరపాటు చేస్తే దానిని పెద్దది చేసేస్తారు, అది మీ పాడుబుద్ధికి గుర్తు. అందుచేత మనం అందరం ఒక్కటే అనుకొంటే ఇటువంటి సమస్యలు అన్నీ పరిష్కారం అయిపోతాయి. మీకు పది రూపాయలు ఇవ్వటంకంటే, ఒక పూట అన్నం పెట్టటంకంటే, మీలో ఏదైనా ఒక బలహీనత ఉంటే ఆ బలహీనతలో నుండి మిమ్మల్ని విడిపించగలిగాను అనుకోండి ఇంతకంటే సత్కర్మ లేదు.

కలియుగం అంటే చీకటి యుగం మంచి చెడ్డగా కనిపిస్తుంది, చెడ్డ మంచిగా కనిపిస్తుంది. చేతులతో శివుడిని పూజించుకోండి, నోటినిండా హరినామం చేసుకోండి. దాని వలన ఈశ్వరుని దయ కలిగి విషయవాసనలలో నుండి బయటకు వచ్చేస్తారు. బుద్ధుడు ఏమన్నాడు అంటే నన్ను గురువు అంటున్నారు, ఏదో అవతారపురుషుడు అంటున్నారు, మీరు నదిని దాటటానికి నావను గెంటే నావికుడను అంటాడు. అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, అసత్యంలోనుండి సత్యంలోనికి దాటించే నావికుడు. దుఃఖంలో నుండి, అశాంతిలో నుండి బయటకు తీసుకొని రావటానికి ఆయన పని చేసాడు కాని వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు అనేటువంటి జడ్జిమెంట్లు ఆయన ఏమీ చెప్పలేదు. ఎందుచేతనంటే ఆయనకు ప్రేమ తప్పించి ఏమీ తెలియదు. మనం ఇంట్లో విషయాలలో జాగ్రత్తగా ఉంటాము. దేవుడి దగ్గరకు వచ్చేటప్పటికి అజాగ్రత్తగా ఉంటాము. మనలను బాగు చేసుకొనే పరిస్థితి వచ్చేటప్పటికి అశ్రద్ధగా ఉంటాము. ఇందులో అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆచరించకుండా నీవు ఏదో బుడబుక్కల మాటలు చెప్పటం వలన దొంగనేను చావదు. ఏదో యజ్ఞాలు చేసాము, యాగాలు చేసాము, సాధనలు చేస్తున్నాము ఈ దొంగ నేను బయటకు పోతుంది అంటే అది అలా బయటకు పోదు. ఈ దొంగ నేనును ఎవడైతే మన శరీరంలో తొక్కి ఉంచాడో వాడి అనుగ్రహం లేకుండా ఆ కాలు బయటకు తీయడు, ఆ కాలు తీస్తేగాని ఇది బయటకు పోదు. నువ్వు ధ్యానం చేయగా చేయగా ఏ నారాయణుడినైతే నీవు ధ్యానం చేస్తున్నావో ఆ ధ్యానమూర్తి నీ మనస్సునంతా ఆక్రమిస్తాడు. ధ్యానమూర్తి నీ మనస్సునంతా ఆక్రమించినప్పుడు, ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో అది అణిగిపోతూ ఉంటుంది. అది అణిగిపోయి, అది ఎక్కడ నుండి అయితే ఉదయించి వస్తోందో అక్కడకు వెళ్ళి కరిగిపోతుంది, అప్పుడు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. స్వరూపసుఖం నీకు అందే వరకు ఈ చావులు పుట్టుకలు తప్పవు, విషయవాసనలు భరించటం తప్పదు, ఈ ద్వైత ప్రపంచంలో నుండి, ఈ ద్వంద్వాలలో నుండి మనం బయటకు వచ్చే అవకాశం లేదు.

దేహప్రారబ్ధాన్ని బట్టి ఈ శరీరం తిరుగుతూ ఉంటుంది. నీ శరీరం ఎక్కడ తిరుగుతూ ఉన్నా నువ్వు ఏ రూపాన్ని అయితే ధ్యానం చేస్తున్నావో మనస్సును దాని మీద నిలబెట్టి ఉంచు. మాట ఏదైనా అంటే ఆ మాటను పోషించుకొనే వాడు రాముడు. ఒక మాట పోషించుకోవటానికి రాజ్యాన్ని కూడా వదిలేసాడు. వాడు రాముడు. రాముడు ధర్మాన్ని

ఆచరించటం కాదు, ఆయన స్వరూపమే ధర్మం. పెద్ద పెద్ద యోగాభ్యాసాలు అక్కరలేదు, మనం ప్రేమతో రాముడి నామాన్ని స్మరించుకొంటూ, ఆయన రూపాన్ని ధ్యానం చేసుకొంటూ ఉంటే మన ఇంద్రియాలు, మనస్సు అణగిపోతాయి. రాముడు ఉన్న చోట కాముడు ఉండడు, రాముడు లేని చోట కాముడు ఉంటాడు అని స్వామీజీ చెప్పారు. అందుచేత మీ హృదయంలోనికి రాముడిని ఆహ్వానించుకొంటే ఇంక కాముడు అక్కడ ఉండడు. రాముడు మీ హృదయంలో లేడు అనుకోండి, అక్కడ కాముడు ఉంటాడు. నాకు సీతారాములకంటే లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి మీద గౌరవం ఎక్కువ. ఎందుచేతనంటే చిన్న కోరిక లేకుండా వారు రాముడికి సేవ చేసారు. శరణాగతికి వీరు ఇద్దరు గుర్తు. వీరిద్దరికి సేవాభావం తప్పించి యింక ఏమీలేదు. ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి, చిత్తశాంతి కలగటానికి రామనామం చాలు. మనం రామనామం చేసుకొంటున్నాము అనుకోండి. ఎవరికైనా ఏదైనా కలిసివచ్చింది అనుకోండి, మనకు ఏమీ కలిసి రాలేదు అనుకోండి, అయినా కూడా మనస్సులో మనకు ఏమీ అనిపించదు, అది రామనామం యొక్క వైభవం. రామనామం చేసేవాడికి వారు బాగుపడిపోతున్నారు, నేను వెనకబడిపోతున్నాను అనే తలంపులు రావు.

మాకు విశ్రాంతి లేదు, మాకు విశ్రాంతి లేదు అని కొంతమంది అంటూ ఉంటారు. నిజంగా మీకు విశ్రాంతి కావాలంటే రామనామం చేసుకోండి. మిమ్మల్ని ఏవైనా వాసనలు పీడిస్తున్నాయి అనుకోండి హృదయపూర్వకంగా రామనామం చేసుకోండి. పులిని చూసి మేకలు, మనుషులు ఎలా పారిపోతారో అలాగ రామనామం చేసుకొంటూ ఉంటే మీలోపల గూడు కట్టుకొనిఉన్న వాసనలు అన్నీ పారిపోతాయి. ఏనుగులాంటి బలమైన జంతువుకు సింహం ఎటువంటిదో కామంలాంటి బలమైన శత్రువుకు రాముడు అటువంటి వాడు. మనలను రక్షించేది రామాయణం అని చెపుతారు. భగవాన్ ఒకమాట చెప్పారు, ఎన్ని పుస్తకాలు చదివినా యిదే సారం. నీ సంకల్పమే నెరవేరుగాక. మనం ఏదైనా సంకల్పించినా భగవంతుడి సంకల్పమే నెరవేరుతుంది. మనం ఏదీ సంకల్పించకపోయినా భగవంతుడి సంకల్పం ఉంటే ఆ పని జరిగిపోతుంది. అందుచేత భగవంతుడి సంకల్పమే నెరవేరుగాక, ఆయన ఇష్టమే నెరవేరుగాక. ఎందుచేతనంటే అసలు మనం అంటూ లేము. ఉన్నది భగవంతుడు ఒక్కడే. ఉన్నది ఆయన ఒక్కడే కాబట్టి ఆయన ఇష్టాన్ని బట్టి ప్రతీదీ జరుగుతుంది కాని ఆయన ఇష్టానికి భిన్నంగా, ఆయన సంకల్పానికి భిన్నంగా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి వీలు లేదు, జరగదు. ఉన్నది ఆయన ఒక్కడే, ఈ జీవుడు అనేవాడు కల్పితం. మాయ

ఎక్కడ ఉంది అంటే ఆ మంచిపని చేయాలి, ఈ మంచిపని చేయాలి అని మనం అనుకొంటాము, ఏదో ఊహించుకొంటాము, ఏవో ఆలోచనలు, తలంపులు వస్తూ ఉంటాయి. అది సాధించాను, ఇది సాధించాను అని తొంబై అనుకొంటాము. చివరకు ఏ పనీ చేయకుండా, ఏదీ సాధించకుండా చనిపోతున్నాము. ఇదే మాయ.

శబరి రాముడి దగ్గరకు వెళ్లలేదు. రాముడే వెతుక్కొంటూ శబరి దగ్గరకు వెళతాడు. దేవుడి దగ్గరకు నీవు వెళ్లనక్కరలేదు, ఆయనే నీ దగ్గరకు వస్తాడు, నీ అర్హత అటువంటిది అని శబరి గురువుగారు ఆమెకు చెప్పారు. అలాగే మనకు అర్హత ఉంటే, పుణ్యబలం ఉంటే గురువే వెతుక్కొంటూ మన దగ్గరకు వస్తాడు. నీ దేహం ప్రారబ్ధాన్ని బట్టి ఏదో ఒకటి చేస్తూ ఉంటుంది. కాని మనస్సుతోమటుకు భగవంతుడిని స్మరించుకో, భగవంతుడిని ధ్యానం చేయటం మానవద్దు. భగవంతుడు చెప్పే విషయాలను శ్రద్ధగా విను, వాటిని మననం చేసుకో. భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం వలె నీకు కనిపిస్తాయి. అవి అబద్ధం కాదు. నీలో ఉన్న కర్మవాసనలు వాటిని అబద్ధంలాగ కనిపింప జేస్తాయి. ఇదే మాయ. భగవంతుడు సత్యం చెపితే అది అసత్యం అని నువ్వు అనుకొంటున్నావు, అలా అనుకోవటమే మాయ. మనస్సును విడిచిపెట్టి మాయలేదు. ఆ మాయనే నేను నేను అనుకొంటున్నావు. గురువునుగాని, ఒక అవతారపురుషుడిని గాని తీసుకొని ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ, ఆయన నామాన్ని స్మరించుకొంటూ ఉంటే ఆయన రూపము, నామము వచ్చి నీ మనస్సును ఆక్రమించుకొంటాయి. అప్పుడు నెమ్మదిగా విషయవాసనలు, కర్మ వాసనలు పోతాయి. ఎప్పుడైతే ఈ వాసనలు పోయినాయో దొంగనేనుకు బలం తగ్గిపోతుంది, ఇంక దానికి మేత దొరకక అది ఎక్కడ నుంచి అయితే వచ్చిందో అక్కడికి వెళ్లి నశిస్తుంది. అప్పుడు నీకు స్వరూపసుఖం తెలుస్తుంది. అచ్యుత, అనంత, గోవింద. గోవిందుడిని స్మరించుకోవటం వలన, ఆయనను ధ్యానించటం వలన, గోవిందుడికి నమస్కారం పెట్టటం వలన కోటి జన్మల్లో ఉన్న పాపం నశిస్తుంది అని చెపుతారు. అంటే కోటి జన్మల నుండి వస్తున్న దోషాలు, వాసనలు, ఆ పాపరాశి ఎంత ఉన్నా గోవిందుడి దయ వలన అంతా కాలిబూడిద అయిపోతుంది. వాడే గోవిందుడు, వాడే నారాయణుడు. నువ్వు అన్ని విధముల ప్రయత్నం చేసి, సాధనలు చేసి, నీకు ఉన్న అన్ని అవకాశములను ఉపయోగించుకొని నారాయణుడిని స్మరించటంకంటే, ఆయనను ధ్యానం చేయటం కంటే నీకు పెద్ద పని ఏముంది అంటున్నారు, అంటే అదే ముఖ్యమైన పని.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-12-2007, గొరగనమూడి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

స్వామి జ్ఞానానంద లౌకికవిద్యలలోను, ఆధ్యాత్మికవిద్యలలోను నిష్ణాతులు. ఆయన రెండు విద్యలలోను విశేషమైన కృషి చేసారు, కొన్ని గ్రంథాలు వ్రాసారు, టీచింగ్ కూడా ఉంది. మనం అందరం ఆనందం కోరుకొంటున్నాము. మనం డబ్బు సంపాదించటం ఆనందం కోసమే, చదువుకోవటం ఆనందం కోసమే, పెళ్లిళ్లు చేసుకోవటం ఆనందం కోసమే, చెడ్డ చేసేవాడు కూడా వాడికి తెలియక అందులో ఏదో ఆనందం ఉందనే చేస్తాడు. ప్రతీవాడు మంచి చేసినా, చెడ్డ చేసినా ఆనందం కోసమే వెదుకుతూ ఉంటాడు. ఎందుచేతనంటే ఆనందం లేకపోతే వాడు జీవించలేడు, వాడి స్వరూపంలో ఉన్నది ఆనందమే. మన హృదయంలో ఉన్న ఆనందం మన చేతికి అందితే మనకు బాహ్యంగా ఆపదలు వచ్చినా, సంపదలు ఎదురైనా నిర్మలంగా, నిశ్చలంగా ఉండగలము. బాహ్యవస్తువుల నుండి పొందేది ఏదైనా సరే ఎండమావులలో నీళ్లలాంటిది అని చెపుతారు. దేహములో దోషం లేదు, దేహాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. లోపలఉన్న సత్యవస్తువుకు దేహానికి ఇసుమంతయు సంబంధము లేదు. జీవుడు వాసనారాహిత్యం అయ్యేవరకు, అలవాట్లలో నుండి బయటకు వచ్చేవరకు దేహాలు వస్తూనే ఉంటాయి. వాసనలు, అలవాట్లు దేహాన్ని పట్టుకొని ఉంటాయి. ఆ దేహం ముసలిది అవుతుంది చనిపోతుంది, వాసనలు అలాగే ఉంటాయి. వాటికి మరల దేహం వస్తుంది. కోరికలను నెరవేర్చుకొంటూ కోరికలను జయించినవాడు ఇంతవరకు ఎవడూ లేడు. ఒక కోరిక నెరవేర్చుకొంటే ఆ నెరవేరిన కోరిక యింకో పది కోరికలను తీసుకొని వస్తుంది.

మీరు ఎన్ని పురాణాలు చదివినా, ఎంతమంది గురువులు చెప్పినది శ్రవణం చేసినా ఇదంతా తాత్కాలికమేగాని దుఃఖం నశించదు. అసలు దేహము నేను అనే మూలసమస్య, ప్రధానతలంపు పరిష్కారం అవ్వాలి. దేహము నేను అనే మూలతలంపులోనే దోషం అంతా ఉంది కాని దేహంలో లేదు. వాసనలు, కోరికలు, గుణాలు ఇవి అన్నీ దేహము నేను అనే మూలతలంపును ఆధారంగా చేసుకొని వస్తున్నాయి. దేహము నేను అనే మూలతలంపు నశించింది అనుకోండి ఒక్కసారిగా మీలో ఉన్న దుర్గుణాలు అన్నీ నశించిపోతాయి, దైవీగుణాలు వచ్చి మిమ్మల్ని వరిస్తాయి. దుఃఖం అనేది బయట లేదు. మమకారంలో దుఃఖం ఉంది. మమకారం లేనివాడికి దుఃఖం లేదు అహంకారానికి, మమకారానికి నీ దేహమే కేంద్రం. దేహాత్మబుద్ధి నశించేవరకూ ఏ మనిషినీ దుఃఖం విడిచిపెట్టదు. ప్రకృతిగుణాలతో సంబంధం

ఉన్నంతకాలం మనకు జ్ఞానోదయం కలుగదు. నిజమైన గురువు మన హృదయం లోనే ఉన్నాడు. ఆయనతో మానసిక అనుబంధం ముఖ్యం. ఆ మనిషి యొక్క శరీరం ఎక్కడ ఉంది అనేది ముఖ్యంకాదు, మనస్సు ఎక్కడ ఉంది అనేది ముఖ్యం. గురువుతో మానసిక అనుబంధం వలన నీకు అంతర్దృష్టిని కలుగజేస్తూ ఉంటాడు. నిరంతరం గురువును గాని, ఈశ్వరునిగాని చింతించటం వలన మనస్సు పల్చబడుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది. భక్తిమార్గం ద్వారా గాని, విచారణ ద్వారా గాని నీ మనస్సును దాని పుట్టుస్థానమైన హృదయంలో ఎక్కువ సేపు నిలబెట్టి ఉండగలిగితే మనో నాశనం ప్రారంభమవుతుంది. మనకు బాహ్యంగా ఎన్నిఉన్నా మనస్సు నశించకుండా ఆత్మజ్ఞానం కలుగదు, ఇందులో రాజీ లేదు. సత్పురుషులతో మానసిక అనుబంధమే కాదు, భౌతికంగా కూడా సత్పురుషుల సాంగత్యం అవసరమే. భౌతికంగా ఎందుకు అవసరం అంటే వారి సన్నిధిలో శాంతితరంగాలు, జ్ఞానతరంగాలు, శక్తితరంగాలు ప్రసరిస్తూ ఉంటాయి, మనకు తెలియకుండా ఆ వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తూ ఉంటాయి. వీరందరి మీద ప్రసరించాలి అని వారు అనుకోరు ఎందుచేతనంటే వారికి ఇతరులు లేరు. సజ్జనసాంగత్యం వలన మనకు వచ్చే లాభం ఏమిటి అంటే వారు పొందిన స్థితిని మనం వెంటనే పొందలేక పోయినా ఆ స్థితిని పొందాలనే బుద్ధి మనకు కలుగుతుంది. మనం బాగుపడటానికి అనేక మంది మహాత్ముల, మహర్షుల దయ అక్కర లేదు. ఒక్క మహర్షి యొక్క దయ చాలు మనం తరించటానికి.

ఈశ్వరసంకల్పం బలీయమైనది. దేహం ఆ సంకల్పం ప్రకారం నడువవలసిందే. అది మంచిప్రారబ్ధం అయినా, చెడుప్రారబ్ధం అయినా దేహం ద్వారా అనుభవించవలసిందే. దేహంతో మనకు తాదాత్మ్యం లేనప్పుడు ప్రారబ్ధం ఎలా ఉన్నా మనకు ఏమీ అనిపించదు. అంతా ఈశ్వర సంకల్పంతో నడుస్తోంది అని నీకు అర్థమైతే, అది నీ గుండెకు తాకితే ఎంత దుఃఖం ఉన్నా అంతా చల్లారి పోతుంది. ఇక్కడ ఎన్ని రకాల దేహాలు ఉన్నా, ఎన్ని రకాల ప్రారబ్ధాలు అనుభవిస్తూ ఉన్నా అంతా స్వప్నమే. ధర్మాన్ని ఆచరించమని మన పెద్దలు ఎందుకు చెప్పారు అంటే ధర్మాన్ని ఆచరించకుండా వాడికి మనోనాశనం కాదు. ఆత్మకు బంధువులు, స్నేహితులు, విరోధులు ఎవరూ లేరు, ఆత్మకు ద్వితీయం లేదు. ఇది అంతా మనస్సుకే. జ్ఞానికి సంపదలు వచ్చినప్పుడు ఎలాగ ఉంటాడో ఆపదలు వచ్చినప్పుడు కూడా అలాగే ఉంటాడు. ఎందుచేతనంటే వాడిది మృత మనస్సు. ఎంత బరువైనా దుఃఖం వచ్చినా వాడి మనస్సును చలింపచేయలేదు. అంత దుఃఖాన్ని ఎవరూ భరించలేరు అనుకొనేటంత దుఃఖం

వచ్చినా జ్ఞానికి కలతలేదు. అంత దుఃఖాన్ని ఎలాగ భరిస్తున్నారు అని చూసేవారికి అనిపించినా బ్రహ్మానుభవం పొందినవాడికి, రాగద్వేషరహితుడికి మనస్సు చలించదు, వికారం కలుగదు. నీకు దేహాత్మబుద్ధి ఉందా, లేదా అని భగవంతుడు అనేక పరీక్షలకు గురి చేస్తాడు. దేహాత్మబుద్ధి లోపల పెట్టుకొని ఏవో పుస్తకాలు చదివి దేహాత్మబుద్ధి లేదు అనుకొంటాడు అనుకోండి, ఏవో సంఘటనలు క్రియేట్ చేసి, మొట్టికాయలు మొట్టి లోపల దేహాత్మబుద్ధి ఉంది అని మనకు తెలియజేస్తాడు, వాడే ఈశ్వరుడు. ప్రతీ జీవుడికి ఆనందం కావాలి ఎందుచేతనంటే ఆనందము మన స్వరూపమై ఉన్నది. మన హృదయంలో ఉన్న నిర్మలమైనస్థితి మనకు అందితే అసలు మనస్సు బాహ్యముఖానికి వెళ్ళమన్నా వెళ్ళదు, వాడికి ఇష్టాలు, అయిష్టాలు ఉండవు. వాడిని ఆకర్షించే వస్తువు కూడా ఈ సృష్టిలో ఏమీ ఉండదు. భగవంతుడు భగవంతుడే, మహాత్ముడు మహాత్ముడే, మహాజ్ఞాని మహాజ్ఞానే. మనలను దోమలు కుడతాయి. మేము మనుషుల్ని కుడుతున్నాము, మేము మనుషులకంటే గొప్పవాళ్ళము అని దోమలు అనుకోవటం ఎలా ఉంటుందో, మనం మహాత్ములను, మహర్షులను దూషిస్తూ మనం గొప్పవారము అనుకోవటం కూడా అలాగే ఉంటుంది. మనం కూడా దోమలలాంటి వారమే అవి కుట్టిపారేస్తున్నాయి, మనం తిట్టి పారేస్తున్నాము.

మమకారం విడిచిపెట్టటం సన్యాసం, రోడ్డు మీద అనేకమంది వెళుతూ ఉంటారు, వారిని చూసినా మనకు రాగద్వేషాలు ఏమీ ఉండవు. అలాగే ఇంట్లో మనుషుల మీద కూడా రాగద్వేషములు పెట్టుకోకుండా ఇది మన డ్యూటీ అనుకొని పనిచేస్తూ న్యూట్రల్‌గా ఉండే గృహస్థులు కూడా ఉన్నారు. ఎర్రబట్టలు కట్టుకొని తిరిగేవారికంటే గొప్ప మానసికస్థితి ఉన్న గృహస్థులు అనేకమంది ఉన్నారు. నిజంగా వారికి సంపద పెరిగినా ఏదో దేహప్రారబ్దాన్ని బట్టి రావలసి ఉంది, వచ్చింది అంటారు గాని సంపద పెరగటం వలన వచ్చే సంతోషాన్ని మటుకు లోపలకు తీసుకోరు. అలాకాకుండా నిరంతరం శవబుద్ధిలో ఉన్నవారు చిన్న సంతోషం వచ్చినా పొంగి పోతారు, చిన్న సంఘటన వ్యతిరేఖంగా జరిగినా కృంగిపోతారు, వారికి లోచూపు ఎలా ఉంటుందో తెలియదు. పుట్టినరోజులు ఎన్నాళ్ళు చేసుకొంటారు అన్నారు భగవాన్. శరీరం వస్తే కదా పుట్టినరోజు, ఇలా ఎన్ని శవాలకు పుట్టినరోజులు చేసుకొంటారు. కనీసం ఈ శరీరం పుట్టిన రోజున అయినా ఈ శరీరం ఎందుకు వచ్చింది, ఈ శరీరానికి నాకు ఉన్న సంబంధం ఏమిటి అని విచారణ చేయటం మానివేసి శరీరాన్ని అలంకరించుకొని ఆ గడ్డీ, ఈ గడ్డీ తినటం, మరల ఈ శరీరాన్ని పొగడటం కోసం జనాన్ని

పోగుచేసుకోవటం. ఒక్కడికీ విచారణ లేదు పైగా దూళ్ళకు గొట్టం పెట్టి పోసినట్లుగా దీనికి పాయసం అవి పోసేయటం. మనోనాశనం అయిన రోజే నిజమైన పుట్టినరోజు. నువ్వు ఏదిగా ఉన్నావో దానిలో నువ్వు మేల్కోవాలి, అదే నిజమైన పుట్టినరోజు. మనస్సు అణగటం చావు, మనస్సు ఉదయించటం పుట్టటం కాని ఈ దేహంతో ఏమీ సంబంధం లేదు. నువ్వు ఎక్కడికి వెళ్ళినా మనస్సు నీ కూడా వచ్చేస్తుంది. నువ్వు మనస్సును పరిష్కరించుకో, అది నీ స్వంతసమస్య. మేము చాలా పరిశుభ్రంగా ఉన్నాము, మేము మంచివారము అని చాలామంది అంటారు. అయితే మనస్సులో అలా ఉంటున్నారా? అక్కడ మనస్సు ముఖ్యం కాని నీ మాట ముఖ్యం కాదు. నీవు సంపదను విడిచిపెట్టావు అనుకో, ఇంటిని విడిచిపెట్టావు అనుకో వీటివలన నీ మనస్సు నశించకపోతే వాటిని విడిచిపెట్టటం వలన ఏమీ ప్రయోజనం లేదు. నీవు చేసే ప్రయత్నం వలన మనస్సు నశించాలి, అది ముఖ్యం. ఎవరైనా యోగులు అయ్యారంటే, మహాత్ములు అయ్యారంటే వారి ప్రయత్నం లేకుండా, ఈశ్వరుని దయ లేకుండా ఆ స్థితిని పొందలేరు. అందుచేత మీరు కూడా హృదయపూర్వకంగా ప్రయత్నం చేయండి. ఇది ఏమీ జిమ్మిక్కుల వలన వచ్చేది కాదు. ఏ ఆధ్యాత్మిక హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడో అక్కడకు కొంచెం కొంచెం జరుగుతూ ఉంటే, మన మనస్సు హృదయం వైపుకు ప్రయాణం చేస్తూ ఉంటే హృదయంలో నుండి మనం భరించలేని శాంతి, ఆనందం వచ్చి మన సహస్రారాన్ని ముంచుతూ ఉంటాయి. ఒక చిన్న గుడిసెలోనికి పెద్ద ఏనుగును తోలితే ఆ గుడిసె పరిస్థితి ఎలాగ ఉంటుందో హృదయంలో ఉన్న ఆనందం, శాంతి మన సహస్రారానికి అందుతూ ఉంటే మన శరీరం పరిస్థితి కూడా అలాగే ఉంటుంది.

లోపల ఉన్న ఆనందం అందకపోవటం వలన ఆనందం కోసం మనస్సు పరిపరివిధములుగా బయటకు పోతోంది. బయట ఎక్కడైతే శాంతి, ఆనందం ఉందని అనుకొంటున్నారో ఒకవేళ అది అనుభవించినా బయటనుండి తీసుకొనే సంతోషం అంతా పరిణామంలో దుఃఖంగా మారిపోవును. విషయచింతన తగ్గించి ఆత్మచింతన పెంచుకొంటూ ఉంటే అది మొదట చేదుగాను, విషంగాను అనిపించినప్పటికీ పరిణామంలో అది అమృతంగా మారిపోవును. లోపల ఉన్న చైతన్యమే, భగవంతుడే మనకు శాస్త్రాన్ని ప్రసాదించాడు. శాస్త్రంలో చెప్పిన మాటలను భూతద్దంలో పరిశీలనగా చూస్తూ, ఆ వాక్యాన్ని నెమరువేసుకొంటూ, దానిని అర్థం చేసుకొని అనుభవంలోనికి తెచ్చుకొంటే గోవిందుడు నీకు తెలుస్తాడు. శాస్త్రప్రమాణముచేత, వేదవాక్యముల చేత తెలియబడే వాడే గోవిందుడు,

వాడే మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఎదుటివారు ఎవరైనా మనకు అమృతం ఇస్తే మనం తిరిగి వారికి విషం ఇస్తాము. గోవిందుడికి మనం విషం తీసుకొని వెళ్ళి ఇస్తే తిరిగి మనకు అమృతం ఇస్తాడు, వాడు గోవిందుడు. ఎదుటివారు మనకు మంచి చేస్తే తిరిగి మనం చెడ్డ చేస్తాము. గోవిందుడికి చెడ్డచేస్తే ఆ చెడ్డను తీసుకొని మనకు మంచి చేస్తాడు. పూతన విషపు స్థనాలు వాడిచేత తాగిస్తే ఆ విషం తాగి మోక్షం ఇచ్చాడు, వాడు గోవిందుడు. గాంధీగారి జీవితచరిత్రలో మంచి వ్రాసారు, ఆయన చేసిన చెడ్డ కూడా వ్రాసారు. ఎందుచేతనంటే ఆ చెడ్డ మనం చేయకుండా ఉండటం కోసం వ్రాసారు.

మనస్సు ఎలా చిరిగిపోతుంది అంటే దానికి భగవాన్ ఒక ఉపాయం చెపుతున్నారు. బుడగను అలా ఊదుతూ ఉంటే ఊదుతూ ఉంటే అది పేలిపోతుంది. అలాగే మీరు ప్రేమించే పరిధి పెంచుకొన్నా మనస్సు పేలిపోతుంది. ఇప్పుడు మన మనస్సు చాలా ఇరుకు. వీరు నావారు, వారు పరాయివారు అనే బుద్ధి లేకుండా, మొఖాలు చూసి పీటలు వేసే పద్ధతి మానేసి నీ ప్రేమను విస్తరించుకొంటూపోతే గుడ్డచిరిగిపోయినట్లు మనస్సు దానంతట అదే చిరిగిపోతుంది. అసలు మనస్సు అనేది లేదు, ఉందని మనం అనుకొంటున్నాము. ఉందని అనుకొంటున్నాము కాబట్టి సాధన చెయ్యండి, సాధన చెయ్యండి. అసలు మనస్సు అనేది లేదనే అనుభవం మీకు రావాలి అప్పటి వరకు సాధన చెయ్యాలి. ఎవడైతే ఆత్మానుభవం పొందాడో వాడిలో నుండి శాంతి, ప్రేమ లోకానికి అంతా పంచిపెట్టబడుతుంది. వాడే జ్ఞాని. జ్ఞాని ఏ ప్రాంతానికి వెళ్ళినా స్వతంత్రించుకొంటాడు. మీ ఇంట్లో మీకంటే ఎక్కువ స్వతంత్రంగా ఉంటాడు. వాడే జ్ఞాని. జ్ఞాని ఒక మాట మాట్లాడితే అది హృదయంలో నుండి వస్తుంది. అది గ్రామాలు దాటుతుంది, దేశాలు దాటుతుంది, సముద్రాలు దాటుతుంది, మొత్తం లోకం అంతా ధ్వనిస్తుంది, అది జ్ఞానం యొక్క వైభవం. మనం ఒక మంచి మాట మాట్లాడితే, అది హృదయంలో నుండి వస్తే, అది జ్ఞానపూరితమైనది అయితే ఆ మాట కలకాలం ఉంటుంది, అనేక మందిని ప్రభావితం చేస్తుంది అంతేకాదు ఏ స్థితిలో ఉండి ఆ మాట పలికారో ఆ స్థితికి మనలను తీసుకొని వెళ్ళటానికి మనలను వెంటాడుతుంది, అది జ్ఞానం యొక్క వైభవం. గౌతమబుద్ధుడికి బాహ్యంగా ఏమీ లోటు లేదు, అన్నీ ఉన్నాయి అయినా అతను గృహాన్ని ఎందుకు విడిచిపెట్టాడు. ఇంట్లోవారి మీద కోపం వలన కాదు. అతని అనుభవాన్ని అతను పొందుతున్న శాంతిని, అతని ప్రేమను, అంతని సందేశాన్ని లోకానికంతా విస్తృతం చేయటానికి ఇల్లు విడిచిపెట్టాడు కాని దానికి మరొక లౌకికకారణం ఏమీ లేదు.

మీరు ఒంటరిగా కూర్చోండి, మీకు అనేక రకాల సంకల్పాలు రావచ్చు, కోరికలు రావచ్చు, భవిష్యత్ గురించి అనేక ప్రణాళికలు రావచ్చు, ఇవన్నీ శరీరంలో నుండి రావటం లేదు, దేహము నేను అనే తలంపులో నుండే అన్నీ వస్తున్నాయి. మిగతా తలంపులన్నింటికి దేహము నేను అనే తలంపే కారణం, అందుచేత దేహము నేను అనే తలంపు ఉన్నంతవరకు నీవు కోట్లాది జన్మలు ఎత్తినా ఇవి అన్నీ నిన్ను విడిచిపెట్టవు, ఇది బాగా అర్థం చేసుకోండి. పట్టించుకోవలసింది పట్టించుకోండి, విడిచి పెట్టవలసింది విడిచిపెట్టండి. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి. ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది. అది ఆయనకు విడిచిపెట్టు. అప్పుడు మీరు నిర్మలంగా ఉంటారు. ఎదురు చూడటం వలన మనస్సు పాడవుతుంది. మీరు పాజిటివ్‌గా ఆలోచించండి. నెగిటివ్ ఆలోచన వద్దు. స్వామి వివేకానంద గురించి ఒక మాట చెప్పమని రవీంద్రనాథ్ ఠాగూర్‌ను అడిగితే స్వామివివేకానందకు ఎవ్విరితింగ్ ఈజ్ పాజిటివ్ అని చెప్పారు అంటే మనం నెగిటివ్ తింకింగ్‌ను రెడ్యూస్ చేసుకొంటూ రావాలి. భగవాన్ దగ్గరకు ఒక పూర్‌మేన్ వచ్చాడు. స్వామీజీ మీ దగ్గరకు అందరూ పళ్ళు అవి తెస్తుంటారు, నేను ఏమీ తేలేకపోయాను, నా దగ్గర ఏమీ లేదు అన్నాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఏమీ తీసుకొని రాలేదు అనకు, నాకేది కావాలో అది తీసుకొని వచ్చావు. నేను నేను అంటున్నావు కదా, ఆ నేనును తీసుకొని వచ్చావుకదా. ఆ నేనును తినటానికే భూమి మీదకు వచ్చాను అన్నారు. ఆ నేనును ఎవరూ డౌట్ చేయటం లేదు. ఈ అబద్ధమైన నేనునే నిజమైన నేను అనుకొంటున్నారు. అలా కొన్ని వేలజన్మలు గడిచిపోతున్నాయి. ఎవడో దేవతాపురుషుడి అనుగ్రహం వలన గాని ఈ అబద్ధమైన నేనులో నుండి బయటకు రాలేము.

శరీరం చనిపోవటానికి ఎవరూ సాధన చేయనక్కరలేదు దేహముతో తాదాత్మ్యం పొందే నేనులో నుండి విడుదలపొందటానికి సాధన అవసరం. మరణానంతరం మన కూడా మనస్సు ఉంటుంది. ఈ మనస్సే అనేకం కల్పిస్తుంది. ఈ శవాలను, హెచ్చుతగ్గులను, లోకాన్ని అన్నింటిని మనస్సే కల్పిస్తుంది. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక బుద్ధి నీకు కలుగనివ్వదు. ఇదే మాయ. మనస్సును జయించిన వాడు లోకాన్ని జయించినట్లే. నీవు ఎన్ని సాధనలు చేసినా మనోనిగ్రహం కోసమే. మనోనిగ్రహం కలిగినప్పుడు మనస్సుకు లోచూపు కలుగుతుంది. లోచూపు లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం లేకుండా నీవు ఎన్ని సాధించినా అవన్నీ ఒకటి లేని సున్నలు. నీ మనస్సు ఎంత నిజమో, నీ దేహం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో నువ్వు సాధించిన గొడవలు కూడా అంతే నిజం. నువ్వు సాధన చేసేటప్పుడు అనేక

అవరోధాలు వస్తూ ఉంటాయి నువ్వు అనంతమైన సహనం పెట్టుకొని వాటిని అతిక్రమించాలి. సమాజపరంగా సమస్యలు వస్తూ ఉంటాయి, కుటుంబపరంగా సమస్యలు వస్తూ ఉంటాయి. సహనంతో వీటి అన్నింటిని అతిక్రమించాలి. సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. ఇన్ని ఆటంకాలు వస్తున్నాయి ఏమిటి అని కంగారు పడవద్దు. ఆటంకాలు వచ్చే కొలది, వాటిని నీవు అతిక్రమించే కొలది నీకు శక్తి పెరుగుతుంది. ఒక చిన్న సమస్య కూడా పిరికివాడికి హిమాలయ పర్వతం కింద కనిపిస్తుంది. ఒక పెద్ద సమస్య కూడా ధైర్యవంతుడికి చిన్న బోదెలాగ కనిపిస్తుంది, చాలా తేలికగా దాటి వెళ్ళిపోతాడు.

పని నిన్ను బంధించదు. అది నేను సాధించాను, ఇది నేను సాధించాను అనుకొంటే మటుకు అది నిన్ను బంధిస్తుంది, అది వాసనగా మనస్సులో పడిపోతుంది. నువ్వు అలా అనుకోకపోతే ఏమీ లేదు. మనిషికి దుఃఖకారణం బయట లేదు, లోపలే ఉంది, కర్తృత్వరూపంలో ఉంది. అందుచేత కర్తృత్వం నశించేవరకు దుఃఖం నశించదు. కర్తృత్వం కేవలం మన తెలివితేటల వలన, సాధనల వలన నశించదు. సత్కర్మ నిష్కామంగా చేస్తూ ఉంటే, అలా చేయగా చేయగా ఎప్పుడో ఈశ్వరానుగ్రహం మన మీద వర్షిస్తుంది, అప్పుడు కర్తృత్వబుద్ధి వేరుతో సహా మనకు తెలియకుండా రాలిపోతుంది, అది కడసారి జన్మ, అది పరమస్థితి. నువ్వు కష్టపడి ఎంత సంపాదించినా మీ ఇంట్లో ఉన్న గుండె సూదెను కూడా తీసుకొనివెళ్ళలేవు, చివరకు రిక్తహస్తాలతో వెళ్ళవలసిందే. అందుచేత ఈ శరీరాన్ని, పరిసరాలను, సంఘటనలను ప్రారబ్ధానికి వదిలెయ్యి, అవి ఎలా జరగాలో అలా జరిగిపోతూ ఉంటాయి. నువ్వు వచ్చిన పని చూసుకో. నువ్వు ఏ పని మీద అయితే ఈ భూమి మీదకు వచ్చావో ఆ పనిని శ్రద్ధగా చేసుకో. ఆత్మజ్ఞానం, మోక్షం మాట అటు ఉంచండి, ముందు సబ్జక్టును అవగాహన చేసుకోండి. సుఖం అనేది బయటలేదు. ఈ లోకంలోనే కాదు ఇతర లోకాలలో కూడా లేదు. సుఖం అనేది నీ హృదయంలోనే ఉంది. ఎక్కడైతే సుఖం ఉందో అక్కడ వెతికితే ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలో అయినా సుఖం నీకు దొరుకుతుంది, ఎక్కడ సుఖం లేదో అక్కడ వెదకటం వలన అలా కోటి జన్మలు ఎత్తినా అది నీకు దొరకదు. లోకంలో అనేక భోగాలు ఉన్నాయి, అనేక ఆకర్షణలు ఉన్నాయి. సత్పురుషుల సహవాసం లేకుండా, ఈశ్వరుని దయ లేకుండా ఈ ఆకర్షణలలో నుండి మనిషి బయటకు రాలేడు, నా మాయను జయించటం చాలా కష్టం కాని నా పాదాలను ఆశ్రయించిన వాడు మటుకు ఈ మాయను అతిక్రమించి నాలో ఐక్యమవుతాడు అని భగవంతుడు చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జనవరి | 17 | చించినాడ, గీతామందిరం |
| జనవరి | 21 | మలికిపురం, సాయిబాబా గుడి ప్రాంగణం |
| జనవరి | 28 | చిలుకూరు |
| ఫిబ్రవరి | 5 | తాడినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## శ్రీ వేణుగోపాల కృష్ణా వందనం

పల్లవి : శ్రీ సద్గురు మా శ్రీగురు
శ్రీ నాన్న మీకివె మా ప్రణతులు

చరణం : ఆధ్యాత్మ సామ్రాజ్య యోగీశ్వరా!
ఆత్మజ్ఞాన ప్రచార పరమేశ్వరా!
కదలి వచ్చావయ్యా కరుణతో నీవిలా
కారుణ్యసాగరా! అరుణాచలేశ్వరా!

చరణం : శ్రీ రమణ ప్రియశిష్య గురుచంద్రమా!
శ్రీ సచ్చిదానంద పరబ్రహ్మమా!
మహనీయ మహితాత్మ గురుదైవమా!
మృదుమధుర భాషణ మా ప్రాణమా!

చరణం : జ్వలియింప జేయుమా - నీ జ్ఞాన జ్యోతి
దహియించు కొనిపోవ - మా అహము భ్రాంతి
దశ దిశల వెలిగేటి - నీ ప్రేమ కాంతి
సూర్యసోముల కిరణములుగ ప్రసరించి॥

చరణం : అవ్యక్త శ్రీ దత్త వాత్సల్యము
వ్యక్తమయ్యెనిలా మీ రూపము
శరణమ్ము శుభకరము మీ దివ్యచరణమ్ము
పరమార్థ దశ చేర్చు భవ్యసోపానమ్ము॥

శ్రీ కృష్ణ దత్త పాదరేణువు
**కందర్ప పద్మారామ్**

# వివేకం వల్లనే - వికారాల్లోంచి విడుదల పొందుతాము

ప్రతీ వ్యక్తిలోనూ రెండు కోణాలు ఉంటాయి. మనలను మనం సాధారణ మనుషులము అనుకొంటే ఏ గొడవా లేదు, కాని ఆదర్శ మానవులము అనుకొంటే దాన్ని నిరూపించుకోవటానికి ఎంతో శ్రమ పడాలి దానికి పాత విషయాలను, విషయ వాసనలను వదులుకోవాలి. దానికి వివేకమే గొప్ప సహాయకారి "స్త్రీ పురుషుల కలయిక గొప్ప సుఖాన్ని ఇస్తుంది అని భ్రమ పడతారు అది కూడా తలంపే. కోరిక నెరవేరటం వల్ల సంతోషం రావటం లేదు అందు మనస్సు ఏకాగ్రమైనప్పడు మనస్సు అంతర్ముఖమై ఆత్మ సుఖం నీకు తెలుస్తున్నది. సుఖం ఆత్మలోనే ఉంది. మనలోని అపవిత్ర భావాలే బయట ఏదో ఉంది ఏదో ఉంది అని అనిపింపజేస్తున్నది అంతా పంచభూతాలే" అన్నారు శ్రీనాన్నగారు. ఏ ప్రాపంచిక వస్తువుల మీద వస్తు దృష్టితో ప్రేమించటానికి ప్రయత్నిస్తామో అప్పడే మోసం చెయ్యబడతాము. సాధన దశలో సామాన్య మోహాలను జయించామా మన ఆధ్యాత్మిక మార్గం నల్లేరు మీద బండిలా సాగిపోతుంది. అట్లా చెయ్యకపోతే ఎక్కడ ఉన్నావు గొంగళీ అంటే "వేసిన చోటే ఉన్నాను మంగలి" అన్నట్లు ఉంటాము. దానికి నిజాయితీతో కూడిన ప్రయత్నముతో ఎటుచూచినా పవిత్రమైన భావాలు, ఉదాత్తమైన ఆలోచనలు కలిగి ఉండాలి. ఏ విషయాల పట్ల మనస్సు వడిగా పరిగెడుతోందో ఆ విషయాలపై మీ మనస్సు ఉపసంహరించే వరకూ ఏ దేవుడూ మనకు సహాయం చెయ్యలేడు. "మన తలవ్రాతల్లోని లోపాలు దిద్దుకొనుటకు మనకు వివేకం ఎంతో అవసరం. 1. తెలిసిన దాన్ని తెలిసినట్లు ఆచరించటం జాగ్రదవస్థ. 2. తెలిసియు ఆచరించకపోవటం స్వప్నావస్థ. 3. తెలియకపోవటం సుషుప్త్యవస్థ" అన్నారు చిన్నమ్మగారు. శరీర తాదాత్మ్యం వల్లనే ప్రాపంచిక భోగాల మీద మక్కువను పటిష్టం చేసి అజ్ఞానాన్ని పెంచటానికి తోడ్పడతాయి. తెలుసుకొనగోరే బుద్ధి బహిర్ముఖమై ప్రపంచాన్ని చూస్తున్నంతసేపు తెలియబడేవి అనంతంగా ఉంటాయి. వివేకంతో అదే అంతర్ముఖమైతే అన్ని వ్యర్థంగా కనిపించి అంతరిస్తాయి. కాబట్టి మమతామోహాదులతో అనేక జన్మలనుంచి కష్టతరము, భాదామయము అయిన పనులను ఆపుచేసి దేన్ని సంసాదిస్తే మరిదేనినీ సంపాదించవలసిన పని లేదో అట్టి ఆత్మ పథాన్ని సాధించటానికి మన సర్వ ప్రయత్నాలను ధారబోసి సఫలం కావాలి అప్పడే మనం ఆదర్శమానవునిగా కృతార్థులౌతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం